
# నాటు కోళ్ళ పెంపకం

## అభ్యాసకుల మార్గదర్శిని




ఆంధ్రప్రదేశ్ కరవు సంసిద్ధతా పథకం, వ్యవసాయశాఖ, ఆంధ్రప్రదేశ్

రూపకల్పన: వాసన్

IFAD
INTERNATIONAL FUND FOR AGRICULTURAL DEVELOPMENT

WASSAN

శిక్షకుల మార్గదర్శిని

# నాటుకోళ్ళ పెంపకం


ప్రచురణ : **జులై 2018**

ప్రతులు :


రూపకల్పన/సహకారం:


**ఎపిడిఎంపి - స్టేట్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్ (ఎస్‌పిఎంయు)**

వెంకటరమణ కాలనీ,

ఎన్‌జిఓ కాలనీ

గుంటూరు జిల్లా

ఆంధ్రప్రదేశ్ - 522 004

**వాసన్**

3వ అంతస్తు, రూం.నం.103

భవానీ అపార్టుమెంట్స్,

విద్యానగర్, కళ్యాణదుర్గం బైపాస్

అనంతపురం జిల్లా

ఇ-మెయిల్ : wassanmail@gmail.com



**ఎపిడిఎంపి-పల్లెజీవం కార్యక్రమానికి సహకారం:**

# ముందుమాట

**కో**ళ్ల పెంపకం విస్తృతంగా అభివృద్ధి చెందిన పరిశ్రమగా రూపొంది, దేశవాళీ, పెరటికోళ్ల పెంపక ప్రాముఖ్యతను తగ్గించుతున్న సమయమిది. అయినను ఇప్పటికి గ్రామీణ ప్రాంతములలో పెరటికోళ్ల పెంపకం జరగుతూనే వున్నది. తక్కువ పెట్టుబడి, ఆర్థిక, సాంస్కృతికతో ముడిపడివున్న పెరటికోళ్ళు, దేశవాళీ కోళ్ల పెంపక ప్రాముఖ్యాన్ని పొంది యుందుట, ప్రజల రుచితో ముడిపడివున్న ఈ దేశవాళీ పెంపకాన్ని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి ఈ చిన్న పుస్తకమును మీ ముందుకు తేవడం జరిగింది.

ఈ రోజు వరకు కూడా బ్రాయిలర్ కోడి కన్న దేశవాళీ కోడి ధర రెండు రెట్లుగా వున్న కారణంతో ఈ జాతి పెంపకాన్ని ప్రోత్సహించవల్సిన అవసరం వున్నది.

దేశవాళీ జాతుల రక్షణ, ఉత్పత్తి, వాటి సామర్థ్యాలను పెంపొందించుటకు గాను, ముఖ్యంగా గ్రామీణులు, ఆదివాసీలలో అవగాహన పెంచే ఉద్దేశంతో ఈ పుస్తకములో రాయబడినవి. పెంపకందార్లకు వ్యాధినివారణ చర్యలు, జాతి పెంపు, నిర్వహణ మొదలగు విషయాలపై అవగాహన పెంచటం గురించి తెలుపబడింది.

ఆరోగ్య సంబంధమైన సమస్యలు ఎక్కువగా ఉత్పన్నమైనప్పుడు సమీప పశువైద్యుని సంప్రదించి పరిష్కరించుకోవాల్సిగా వున్నది.

# విషయసూచిక


| సెషన్ నం. | అంశం | పేజీ నం. |
|---|---|---|
| 1 | గ్రామీణ జీవనోపాధులలో పెరటి కోళ్ల ప్రాధాన్యత | 5 |
| 2 | పెరటి కోళ్ళ పెంపకంలోని సదవకాశాల వినియోగం - సంబంధిత ఆరోగ్య సంరక్షణ సేవలు | 8 |
| 3 | దేశీ పెరటికోళ్ళ పెంపకంలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు | 10 |
| 4 | వ్యాపారపరంగా బ్రీడింగ్ ఫారం ఏర్పాటు ప్రక్రియ | 17 |
| 5 | గ్రామ స్థాయిలో పెరటి కోళ్ళ పెంపకం- అభివృద్ధి కార్యక్రమానికి ప్రణాళిక | 27 |

# సెషన్ 1 - గ్రామీణ జీవనోపాధులలో పెరటి కోళ్ళ ప్రాధాన్యత

## సెషన్ మార్గదర్శిని:

**కోర్సు** : **గ్రామీణ ప్రాంతాల్లో పెరటికోళ్ల పెంపకం - పరిచయం**

సెషన్ నెం, పేరు :
1. గ్రామీణ జీవనోపాధులలో పెరటి కోళ్ళ ప్రాధాన్యత
2. దేశీయ కోళ్ళ రంగంలో విభిన్న ఉత్పత్తి వ్యవస్థలు
3. గ్రామీణ ప్రాంతాలలో పెరటి కోళ్ళ ఉత్పత్తి వ్యవస్థల్లో సమస్యలు

సెషన్ ఉద్దేశాలు
(అభ్యాసకుల మార్గదర్శిని) :

1. గ్రామీణ జీవనోపాధులలో పెరటి కోళ్ళ పెంపకం ప్రాధాన్యతను అర్థం చేసుకుంటారు.
2. దేశీయ కోళ్ళ రంగంలో విభిన్న ఉత్పత్తి వ్యవస్థలను అర్థం చేసుకుని, పెరటికోళ్ల పెంపకానికి అనువైన సుస్థిర నమూనాను గుర్తించగలుగుతారు.
3. గ్రామస్థాయిలో పెరటి కోళ్ళ ఉత్పత్తి వ్యవస్థల్లో ఉండే సమస్యలు గుర్తించ గలుగుతారు.

**సెషన్ లో వివరించే స్థూల అంశాలు:**
**(అభ్యాసకుల మార్గదర్శిని) :**

### 1. గ్రామీణ జీవనోపాధులలో పెరటి కోళ్ళ పెంపకం ప్రాధాన్యత

గ్రామీణ భారత దేశంలో పెరటి కోళ్ళ పెంపకం ఒక ప్రధానమైన ఉత్పత్తి వ్యవస్థగా ఉన్నది. గ్రామీణ ప్రాంతాలలో అనేక కుటుంబాలలో 'దేశీ' పెరటి కోళ్ళ పెంపకం జరుగుతోంది. ప్రధానంగా కుటుంబ స్థాయిలో ఆహారంగా మాంసం, గుడ్లు వంటి అవసరాలు తీర్చుకోవడంతో పాటుగా వాటిని అమ్మడం ద్వారా ఆయా కుటుంబాలు చెప్పుకోదగిన స్థాయిలో అదనపు ఆదాయం పొందుతున్నాయి. దేశంలో మొత్తం మీద పెరటి కోళ్ళ పెంపకంలో 'దేశీ' కోళ్ళ వాటా 84% పైనే ఉంది. దేశీ కోళ్ళు ఆరు బయట తిరుగుతూ మేత మేస్తాయి. సహజంగా పొదుగుతూ సంతానోత్పత్తిని వృద్ధి చేసుకుంటాయి. రోగాలను బాగా తట్టుకుంటాయి. చావు, ప్రమాదాల నుంచి సులభంగా తప్పించుకుంటాయి. దేశీ కోళ్ళ పెంపకంలో ఇన్ని రకాల సానుకూల అంశాలు ఉన్నప్పటికీ, దేశంలో విస్తారంగా దీనిని చేపడుతున్నప్పటికీ, దేశీ కోళ్ళ ఉత్పత్తి వ్యవస్థలను పటిష్టపర్చడానికి జరగాల్సిన ప్రయత్నాలు జరుగలేదు. సకాలంలో టీకాలు వేయడం (వ్యాక్సినేషన్)తో పాటుగా పెరటి స్థాయిలో దేశీ కోళ్ళ ఉత్పత్తి వ్యవస్థలకు సంబంధించి సమగ్ర పెంపకం పద్ధతులు పాటించడం ద్వారా గ్రామీణ కుటుంబాల ఆదాయాన్ని గణనీయంగా పెంచే అవకాశం ఉంది.

## కేస్ స్టడీ : 1 చిన్న పెట్టుబడులతోనే పెద్ద మార్పు

పెరుమాళ్ తమిళనాడు జిల్లాలోని నమ్మక్కాల్ జిల్లా జంబుమడాయి గ్రామ నివాసి. ఆరుగురు వ్యక్తులున్న ఆయన కుటుంబానికి 4 ఎకరాల భూమి ఉంది. అది ఆధారంగా వ్యవసాయంతో పాటుగా తను పశుజీవాలు, దేశీ కోళ్ళ (పెరుంజది జాతి) పెంపకం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది పొడవునా తన వద్ద ఎప్పుడూ 8-10 దేశీ కోళ్ళు ఉంటాయి. ఎక్కువగా పెరట్లోనే ఆరుబయట మేస్తూ ఉంటాయి. అప్పుడప్పుడూ కొంతమటుకు జొన్నలు, నూకలు వంటివి అదనపు దాణాగా ఇస్తారు. ఇవి కూడా తన పొలంలో పండించినవే. నమ్మక్కాల్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం (కె.వి.కె) ఈ జీవాలకు అవసరమైన టీకాలు, ఆరోగ్య సంరక్షణ సేవలు అందించింది. కోడి పెట్టలు, కోడి పిల్లలను పెట్టడానికి 'రాత్రి వసతి' (నైట్ షెల్టర్) ఏర్పాటు చేశాడు. కోడి పుంజులు మాత్రం రాత్రి పూట మామిడి, అకేషియ చెట్ల మీద ఉండిపోతాయి. ప్రతి 3-4 నెలలకు ఒకసారి తను 35-40 కోళ్ళను అమ్ముతాడు. ఏడాదిలో అలా దాదాపు120 కోళ్ళు అమ్ముతూ, పెరుమాళ్ వాటి మీద ఏడాదికి 30,000/- రూపాయలు ఆదాయం పొందుతున్నాడు.

పై తెలిపిన కేస్‌స్టడీ బట్టి చూస్తే, టీకాలతో పాటుగా మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా కోళ్ళు పెంచే కుటుంబాలు చెప్పుకోదగిన స్థాయిలో అదనపు ఆదాయం పొందవచ్చని తెలుస్తున్నది. గ్రామీణ ప్రాంతాలలో, ముఖ్యంగా గిరిజన ప్రాంతాలలో, ఏడాది పొడవునా, కుటుంబ స్థాయిలో కనీసం 5 కోళ్ళు కలిగిఉండి, వాటికి ముఖ్యంగా కొక్కెర, అమ్మతల్లి వంటి రోగాలు రాకుండా టీకాలు వేయించడం, తక్కువ ఖర్చుతో రాత్రి వసతి ఏర్పాట్లు చేయడం, కొంతమట్టుకు అదనపు దాణా అందించడం వంటి పనులు చేయగలిగితే, ఆ కుటుంబం ఏడాదిలో కనీసంగా 50 కోళ్ళను పెంచి అమ్ముకునే వీలుంటుంది. దాని ద్వారా ఆ కుటుంబం ఒక ఏడాదిలో 12000–15000/– రూపాయల వరకు ఆదాయం పెంచవచ్చు.

### 2. భారతదేశంలో కోళ్ళ పెంపకంలో విభిన్న ఉత్పత్తి వ్యవస్థలు

భారతదేశంలోని గ్రామీణ ప్రాంతలాలో ప్రధానంగా 3 రకాల కోళ్ళ ఉత్పత్తి వ్యవస్థలు కనపడతాయి. అవి విస్తారిత వ్యవస్థ (బ్రాయిలర్ కోళ్ళు), పాక్షిక విస్తారిత వ్యవస్థ (మేలు రకం జాతి కోళ్ళు), విస్తృత వ్యవస్థ (దేశీ జాతి కోళ్ళు) విస్తారిత వ్యవస్థ ఒకరకంగా నిర్బంధ పెంపకం. కోళ్ళను పంజరం లేదా కోళ్ళ ఫారాలలో పెంచుతారు. కోడి పిల్లలను హాచరీ నుంచి తెచ్చి, బయటినుంచి దాణా ఇచ్చి పెంచుతారు. సరైన బరువు రాగానే (1.5–2.0 కిలోలు) వాటిని అమ్మేస్తారు. బయటినుంచి దాణా తెప్పిస్తారు కాబట్టి ఈ రకపు పెంపకానికి ఎక్కువ పెట్టుబడులు అవసరమవుతాయి. పాక్షిక విస్తారిత వ్యవస్థలో వనరాజా, గిరి రాజా వంటి మేలు జాతి (పరిశోధనా సంస్థలు అభివృద్ధిపరచినవి) కోళ్ళను పంజరం లేదా కోళ్ళ ఫారాలలో పెంచుతారు. కోడి పిల్లలను పరిశోధనా సంస్థలు/కృషి విజ్ఞాన కేంద్రాలు/ప్రైవేట్ హాచరీల నుంచి కొనుగోలు చేసి, ఎక్కువమట్టుకు అదనపు దాణా ఇచ్చి పెంచుతారు. కోడి పిల్లలకు 3 నెలల వయసు తరువాత, వాటిని అప్పుడప్పుడు బయట మేయడానికి షెడ్డు బయటకు వదులుతారు. ఈ పాక్షిక విస్తారిత వ్యవస్థ కూడా ఎక్కువ పెట్టుబడులతో కూడుకున్నదే.

ఇక విస్తృత వ్యవస్థలో కోళ్ళను తక్కువ సంఖ్యలో పెంచుతారు. ప్రధానంగా ఆరుబయట మేస్తూ పెరుగుతాయి. రాత్రిపూట రక్షణకు ఏదైనా రాత్రి వసతి ఏర్పాటు చేస్తారు లేదా గంప కింద ఉండేలా చూస్తారు. ఆహారాన్ని బయట వెతుక్కుని తింటాయి. కోడి పెట్టలు గుడ్లు పెట్టి, వాటిని పొదిగి పిల్లలను చేస్తాయి. ఇది తక్కువ ఖర్చుతో కూడిన ఉత్పత్తి వ్యవస్థ. వీటికి రోగాలు, వ్యాధుల బారిన పడే ప్రమాదం ఎక్కువ ఉంటుంది. అయితే, క్రమం తప్పకుండా టీకాలు వేయించడం, ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడం, రాత్రి వసతి ఏర్పాటు చేయడం వంటి పనులు చేస్తే, వీటికి రోగాలు, వ్యాధుల బారిన పడకుండా చూడవచ్చు. ఇతర జంతువుల నుంచి దాడుల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. వాటివల్ల మరణాల రేటు కూడా తగ్గించవచ్చు.

గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలలో కోళ్ళ పెంపకంలో ఈ విస్తృత ఉత్పత్తి వ్యవస్థనే ఎక్కువగా అమలవుతోంది. మేత వనరుల లభ్యత ఎక్కువగా ఉండడం, తక్కువ శ్రమ వంటి అంశాలు దానికి కారణం. ఇటువంటి ప్రాంతాలలో దేశీ కోళ్ళ పెంపకం అన్నది అక్కడి ప్రజలకు కేవలం జీవనాధారం మాత్రమే కాదు అది వాళ్ళ ఆచార, సాంప్రదాయ వ్యవహారాలతో కూడా ముడిపడి ఉండే ఒక వ్యాపకం.

## సంబంధిత అంశాలు (ఏవైనా ఉంటే )

| నేర్చుకునే కాల వ్యవధి | థియరీ/బోధన (3 గంటలు) | ఆచరణాత్మక ప్రయోగాలు/ ప్రాక్టికల్స్ (2 గంటలు) |
|---|---|---|
| నేర్చుకున్న అంశాలు/ ఫలితాలు | **విజ్ఞాన పరమైన అంశాలు/ఫలితాలు** | **నైపుణ్య సంబంధిత అంశాలు/ ఫలితాలు** |
| | 1. గ్రామీణ జీవనోపాధుల పరంగా పెరటి కోళ్ల పెంపకం ప్రాధాన్యత<br>2. కోళ్ల పెంపకంలో విభిన్న ఉత్పతి వ్యవస్థల పరంగా సానుకూల/ప్రతికూల అంశాలు. గ్రామీణ ప్రాంతాలలో పెరటి కోళ్ళ పెంపకం పరంగా దేశీ కోళ్ళకే ఎందుకు సుస్థిర సానుకూలత ఉన్నది?<br>3. పెరటి కోళ్ళ పెంపకంలో ముఖ్యమైన సమస్యలు ఏమిటి? వాటికున్న పరిష్కార మార్గాలేమిటి? | 1. కోళ్ల పెంపకంలో విభిన్న ఉత్పతి వ్యవస్థల పరంగా సానుకూల/ప్రతికూల అంశాలను మదింపు చేసుకోగలుగుతారు.<br>2. ఫోకస్ గ్రూప్ చర్చల్లో సరైన ప్రశ్నలు అడుగుతూ, సమస్యను అర్థం చేసుకోవడాని కమ్యూనిటీతో కల్సి చర్చించగలుగుతారు. |
| నేర్చుకోవడానికి రిఫరెన్స్ మెటీరియల్ | **రీడింగ్ మెటీరియల్ (అభ్యాసకుల కిట్‌లో నుంచి)**<br>1. కోళ్ల పెంపకంలో విభిన్న ఉత్పతి వ్యవస్థలను వివరించే నోట్ (ఆడియో విజువల్ రిసోర్సెస్)<br>2. ఫోకస్ గ్రూప్ చర్చల కోసం ప్రశ్నావళి: వెబ్ రిఫరెన్సులు | |
| ఆలోచనా సరళికి అనుగుణంగా | **విజ్ఞానం / నైపుణ్యం సంబంధిత ప్రశ్నలు:**<br>విశ్లేషణ/మదింపునకు అనువైన ప్రశ్నలు | |

## సెషన్ ఎక్సర్ సైజ్ / కేస్ స్టడీ

### ఈ కింద తెలిపిన అంశాలపై గ్రూపు ఎక్సర్ సైజులు

1. ఏడాది పొడవునా కోళ్ళ మంద పెంపకం సరళి (సీజనల్, పండగలు, రోగాలు/వ్యాధులు)
2. రోగాల వల్ల మరణాలు (లక్షణాలు), దాడులు/ప్రమాదాలు (వయసు /సీజన్), దొంగ తనాలు వంటివి.
3. కుటుంబ స్థాయిలో ఆర్థిక అంశాలు, ఆదాయం, కోళ్ళ పెంపకంలో లింగ పరమైన అంశాలు

## నేర్చుకునే కీలక అంశాలు - విశ్లేషణ

1. కోళ్ళ పెంపకంలో విభిన్న ఉత్పత్తి వ్యవస్థల మధ్య పోలిక
2. గిరిజన ప్రాంతాలలో విస్తృత కోళ్ళ ఉత్పత్తి వ్యవస్థకు సంబంధించిన సుస్థిరత
3. కోళ్ళ మందల స్వయం విస్తృతి

****

# సెషన్ 2 - పెరటి కోళ్ళ పెంపకంలోని సదవకాశాల వినియోగం - సంబంధిత ఆరోగ్య సంరక్షణ సేవలు

## సెషన్ మార్గదర్శిని:

| | | |
|---|---|---|
| **కోర్సు** | : | **గ్రామీణ ప్రాంతాల్లో పెరటి కోళ్ల పెంపకం** |
| సెషన్ నెం, పేరు | : | 1. విభిన్న కోళ్ల జాతులు<br>2. పెరటి కోళ్ల పెంపకంలోని సదవకాశాల వినియోగం - సంబంధిత ఆరోగ్య సంరక్షణ సేవలు |
| సెషన్ ఉద్దేశాలు (అభ్యాసకుల మార్గదర్శిని) | : | 1. విభిన్న రకాల కోళ్ల జాతులు, వాటి ఉత్పత్తి సామర్థ్యాలు, స్థానిక జాతుల ప్రాధాన్యత వంటి అంశాలను అర్థం చేసుకోవడం<br>2. ప్రతి దశలోనూ అవసరమైన సహాయక సేవలు |

సెషన్‌లో వివరించే స్థూల అంశాలు: (అభ్యాసకుల మార్గదర్శిని) :

### 1. విభిన్న రకాల కోళ్ళ జాతులు

కోళ్ళ పెంపకం విభిన్న రకాల వ్యవస్థల్లో, విభిన్న రకాల ఉద్దేశాలకు లోబడి జరుగుతుంది. పారిశ్రామిక స్థాయిలో కోళ్ళ పెంపకం బ్రీడింగ్ ఫామ్స్, పిల్లల ఉత్పత్తి వంటి విభిన్న వ్యవస్థల్లో చేపడతారు. జంతు జన్యు వనరుల జాతీయ బ్యూరో ((NBAGR) లెక్కల ప్రకారం మన దేశంలో 17 రకాల విశిష్ట కోళ్ళ జాతులు నమోదు కాబడి ఉన్నాయి (వివరాలకు: http://www.nbagr.res.in/regchi.html). వీటిని 'దేశీ' లేదా దేశీయ కోళ్ళ జాతులు అంటారు. ఈ దేశీయ కోళ్ళ జాతుల్లో అసీల్, కడవ్‌నాథ్, దాంకీ, కలస్తి, ఘాఘస్ వంటివి ప్రధానమైన జాతులు. ఒక కదక్ నాద్ తప్ప మిగతా దేశీ జాతుల కోళ్ళకు అన్నింటికీ పిల్లలను పొదిగే సామర్థ్యం మెండుగా ఉంటుంది. స్థానిక పర్యావరణ పరిస్థితులను కూడా బాగా తట్టుకుని నిలబడతాయి. దేశీ జాతి కోళ్ళను, బయటి జాతి కోళ్ళతో సంకరం చేయడం ద్వారా పుట్టే సంకర జాతి కోళ్ళది ఇంకో రకపు ఉత్పత్తి వ్యవస్థ. తక్కువ సాంకేతికత అవసరమైన ఈ కోళ్ళను కూడా చిన్న చిన్న మందలుగా పెరట్లల్లో పెంచుతూ ఉంటారు. అయితే ఇవి అంత చురుకుగా ఉండవు.

### 2. పెరటి కోళ్ళ పెంపకపు అవకాశాలను సద్వినియోగపరుచుకోవడానికి అవసరమైన ఆరోగ్య సంరక్షణ సేవలు

దేశీ కోళ్ళపైన వ్యాధులు, రోగాల తీవ్రత, ప్రభావం ఎక్కువగానే ఉంటుంది కాబట్టి వాటిని తట్టుకునేరీతిలో అవసరమైన ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులో ఉండడం చాలా అవసరం. ఇవి ప్రధానంగా స్థానికతకు అనువైన ఉత్పత్తి వ్యవస్థలు కనుక వీటికి క్రమం తప్పకుండా, సకాలంలో సేవలు అందడం కూడా చాలా ముఖ్యం. స్థానికంగా ఉండే యువత/మహిళలకు శిక్షణ అందించడం ద్వారా అలాంటి సేవలు అందుబాటులోకి తీసుకురావచ్చు. అలాంటి యువత/మహిళలకు (కోళ్ళ వ్యాక్సినేటర్లు) 3-5 రోజుల పాటు శిక్షణ అందించడంతో పాటుగా, టీకాలు, మందుల నిర్వహణకు అవసరమైన కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ఆ సేవలు అందుబాటులోకి తేవచ్చు. వీళ్ళకు శిక్షణ ఇచ్చే సమయంలో స్థానిక పశు వైద్య అధికారి ఉండేలా చూడడం చాలా ముఖ్యం. కోళ్ళ పెంపకందార్లతో ఉమ్మడి ప్రయోజనాల బృందాలు (సి.ఐ.జి.లు) ఏర్పాటు చేస్తూ, ఈ సేవల పంపిణీ వ్యవస్థను సంస్థాగతం చేయవచ్చు. ఈ కోళ్ళ పెంపకందార్లు అందరూ తమ వంతు వాటాగా కొంత మొత్తం సమకూరుస్తూ, గ్రామ స్థాయిలో ఒక కోళ్ళ నిధిని ఏర్పాటు చేసుకోవచ్చు. ఇది వాళ్ళు తప్పనిసరిగా చేయవలసిన పని. మామూలుగా గ్రామంలోని 100 కుటుంబాలు కలిసి ఈ కోళ్ళ నిధిని ఏర్పాటు చేసుకోవచ్చు. ఆరోగ్య సంరక్షణ సేవలకు కొంత మొత్తం డిపాజిట్ చేయడంతో

పాటుగా, సభ్యత్వ రుసుముగా నిర్దిష్ట మొత్తాలను చెల్లిస్తూ ఈ నిధిని నిర్వహించుకోవచ్చు. ఒక వ్యాక్సినేటర్ 50 లేదా అంతకన్నా ఎక్కువ మంది పెంపకం దార్లకు సేవలు అందించవచ్చు. ఇలా తను అందించే సేవలకు ఉమ్మడి ప్రయోజనాల బృందం (సి.ఐ.జి.) ద్వారా నిర్దిష్ట మొత్తంలో రుసుము వసూలు చేసుకోవచ్చు. రోజూ సాయంత్రం 1-2 గంటల పాటు పని చేస్తూ, ఈ సేవల ద్వారా వ్యాక్సినేటర్ కొంత అదనపు ఆదాయం సంపాదించుకోవచ్చు.

**సంబంధిత అంశాలు (ఏవైనా ఉంటే) : మంచి ఆరోగ్యంతో ఉన్న కోళ్ళ ఎంపికకు ప్రామాణికాలు**

| నేర్చుకునే కాల వ్యవధి | థియరీ/బోధన (3 గంటలు) | ఆచరణాత్మక ప్రయోగాలు/ ప్రాక్టికల్స్ (2 గంటలు) |
|---|---|---|
| నేర్చుకున్న అంశాలు/ | విజ్ఞాన పరమైన అంశాలు/ఫలితాలు | నైపుణ్య సంబంధిత అంశాలు/ఫలితాలు |
| | 1. కోళ్ళ జాతులు<br>2. గ్రామీణ పెరటికోళ్ల పెంపకం - సంబంధిత ఉత్పత్తి వ్యవస్థల్లో విభిన్న కోళ్ళ జాతుల పాత్ర<br>3. గ్రామీణ ప్రాంతాలలో పెరటికోళ్ల పెంపకానికి అవసరమైన సహాయక సేవలు | 1. స్థానిక పరిస్థితులకు అనువైన కోళ్ళ జాతులను గుర్తించడం- ఎంపిక చేయడం .<br>2. చెల్లింపుల ఆధారిత ఆరోగ్య సంరక్షణ సేవలకు సి.ఐ.జి.- కోళ్ళ నిధి ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించడం |
| నేర్చుకోవడానికి రిఫరెన్స్ మెటీరియల్ | రీడింగ్ మెటీరియల్ (అభ్యాసకుల కిట్‌లో నుంచి)<br>1. భారత దేశంలో కోళ్ళ జాతులపై వ్యాసాలు<br>2.పెరటి కోళ్ళ పెంపకపు అవసరాలపై ఉన్న వ్యాసాలు<br>3.ఆడియో విజువల్ రిసోర్సెస్ (అభ్యాసకుల కిట్‌లో నుంచి)<br>4.వెబ్ రెఫరెన్సులు | |
| ఆలోచనా సరళికి అనుగుణంగా | విజ్ఞానం / నైపుణ్యం సంబంధిత ప్రశ్నలు:<br>విశ్లేషణ/మదింపునకు అనువైన ప్రశ్నలు | |

## సెషన్ ఎక్సర్ సైజ్ / కేస్ స్టడీ

**ఈ కింద తెలిపిన అంశాలపై గ్రూపు ఎక్సర్ సైజులు**

1. ఆయా ప్రాంతాలలో అందుబాటులో ఉండేకోళ్ళ జాతులు, వాటి లక్షణాలు
2. ఆయా ప్రాంతాలలో ఆరోగ్య సేవల అందుబాటులో లోపాలు/అవరోధాలు తీర్చడానికి సహాయపడటం, వాటిని మరింత మెరుగుపర్చడం

## నేర్చుకునే కీలక అంశాలు - విశ్లేషణ

1. విభిన్న దేశీ జాతి కోళ్ళ ఉత్పత్తి సామర్థ్యం - వాటికి ఉన్న సామాజిక, ఆర్థిక ప్రాధాన్యత
2. దేశీ కోళ్ళ పెంపకానికి అవసరమయ్యే ఆరోగ్య సేవలు
3. ఉమ్మడి ప్రయోజనాల బృందం (సి.ఐ,జి.), కోళ్ళ నిధి

****

# సెషన్ 3 - దేశీ పెరటికోళ్ళ పెంపకంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు

## సెషన్ మార్గదర్శిని:

**కోర్సు** : **గ్రామీణ ప్రాంతాల్లో పెరటి కోళ్ల పెంపకం - పరిచయం**

సెషన్ నెం, పేరు : 1. దేశీ పెరటికోళ్ల పెంపకంలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు
2. రోగాలు
3. ఆరోగ్య సంరక్షణ - నిర్వహణ

సెషన్ ఉద్దేశాలు
(అభ్యాసకుల మార్గదర్శిని) :
1. దేశీ జాతి కోళ్ల ఉత్పత్తి వ్యవస్థల మెరుగుదలకు అవసరమైన పద్ధతుల సమాహారం
2. కోళ్లకు వచ్చే సాధారణ వ్యాధులు - వ్యాపించే వ్యాధులు - వ్యాపించని వ్యాధులు - వాటి నియంత్రణ
3. కోళ్ల షెల్టర్ లో పరిశుభ్రత నిర్వహణ - తాగు నీటి ఏర్పాట్లు

**సెషన్ లో వివరించే స్థూల అంశాలు:**
**(అభ్యాసకుల మార్గదర్శిని) :**

### 1. దేశీ పెరటి కోళ్ళ పెంపకంలో పాటించదగిన యాజమాన్య పద్ధతుల సమాహారం

**కుటుంబ స్థాయిలో దేశీ పెరటి కోళ్ళ ఉత్పత్తి వ్యవస్థలను మెరుగుపరచడానికి ఈ కింద తెలిపిన యాజమాన్య పద్ధతులు పాటించాలి:**

**ఎ). పరిశుభ్రమైన రాత్రి వసతి (నైట్ షెల్టర్) –** కుటుంబస్థాయిలో కోళ్ళ పెంపకానికి, గాలి, వెలుతురు సరిగ్గా ఉండి, పరిశుభ్రంగా ఉండే రాత్రి వసతి ఏర్పాటు అవసరం. 5 కోళ్ళు పెంచే కుటుంబంలో కోళ్ళ కోసం 20 చదరపు అడుగుల (5అ × 4 అడుగులు) విస్తీర్ణం కలిగిన రాత్రి వసతి ఏర్పాటు ఉండాలి. స్థానికంగా దొరికే వెదురు, కలప, రాళ్ళతో పాటుగా చవకగా దొరికే జి.ఐ. వెల్డ్ మెష్, పై కప్పు షీట్ వంటి ముడి పదార్థాలతో వాటితో ఈ రాత్రి వసతి ఏర్పాటు స్వంతంగా నిర్మించుకోవచ్చు. కుటుంబ స్థాయిలో ఇలాంటి రాత్రి వసతి ఏర్పాటుకు అయ్యే బడ్జెట్ అంచనా ఈ కింద తెల్పిన రీతిలో ఉంటుంది:


**కుటుంబ స్థాయిలో కోళ్ళ కోసం రాత్రి వసతి ఏర్పాటు (వ్యయ అంచనా రూ.)**

విస్తీర్ణం 4'-0' X 5'-0" వ 20 చదరపు అడుగులు

| క్ర.సం | వివరణ | సైజు | విస్తీర్ణం | రేటు | మొత్తం |
|---|---|---|---|---|---|
| 1 | ఏ.సి,. సిమెంట్ షీట్ (2 షీట్లు 6X3) | 6'X6' | 36 చ.అ | 350.00 | 700.00 |
| 2 | మెష్ | 20'X4' | 80 చ.అ | 10.00 | 800.00 |
| 3 | స్థానిక కలపతో తలుపు | 2'X4' | 8 చ.అ | 50.00 | 400.00 |
| 4 | నిలువు గోడలకు కలప | 8 (నెం) | 6'–0" ఎత్తు | 100.00 | 600.00 |
| 5 | అడ్డు గోడలకు కలప | 6 (నెం) | 6'–0" ఎత్తు | 100.00 | 600.00 |
| | | | | మొత్తం | **3,100** |

ఈ రేట్లు సూచనప్రాయంగా ఇవ్వబడినవి.

ఈ రాత్రి షెల్టర్ ను ప్రతి రోజూ శుభ్రం చేయాలి. ఫ్లోరింగ్ పొడిగా ఉంటే, జీవాలకు శ్వాస సంబంధిత, జీర్ణ సంబంధిత రోగాలు రాకుండా ఉంటాయి. కోళ్ళ మల విసర్జితాలను వ్యవసాయంలో ఎరువుగా వాడవచ్చు. దానివల్ల భూసారం మెరుగుపడుతుంది. కోళ్ళ మల విసర్జితాలు మొక్కలకు మంచి పోషకాలను అందిస్తాయి.



**అదనపు దాణా :** దేశీ కోళ్ళ పెంపకం పరంగా వాటికి అందించే పోషకాహారానికి చాలా ప్రాధాన్యత ఉంది. చాలామట్టుకు వాటికి ఈ పోషకాహారం పెరట్లోని ఆరు బయట ప్రాంతాలలోనే దొరుకుతుంది. అయితే ముఖ్యంగా వేసవి నెలల్లో ఈ ఆరు బయట ప్రాంతాల నుంచి వాటికి పోషకాలు సరిగ్గా అందవు. కాబట్టి ఆ సమయంలో వాటికి బయటి నుంచి కొంత అదనపు దాణా అందించవలసి ఉంటుంది. చిరుధాన్యాల పొట్టు ద్వారా వాటికి అవసరమైన శక్తి అందుతుంది. పొట్టు, తవుడు, పేడ, క్రిములు, పురుగులు, అజోల వంటివి దాణాగా అందిస్తే వాటికి ప్రోటీన్లు అందుతాయి. గుడ్డు పెంకు నిర్మాణానికి కాల్షియం అవసరమవుతుంది. దాని కోసం ఎండు చేపల పొట్టు, గుడ్డు పెంకులు, గవ్వలు వంటివి దాణాగా వేయవచ్చు.

| క్ర.సం | దాణా రకాలు | ఉపయోగం | దాణా వనరులు |
|---|---|---|---|
| 1 | శక్తి నిచ్చేవి | శరీర ఉష్ణోగ్రతను నిర్వహిస్తాయి. కోళ్ళ కదలికలను ప్రభావితం చేస్తాయి. | బియ్యం, గోధుమలు, మొక్క జొన్న, వాటి పొట్టు/తవుడు, జొన్న, సజ్జ, రాగి, అరటి తొక్క, వేళ్ళు, ట్యూబర్లు వంటివి |
| 2 | ప్రోటీన్లు ఇచ్చేవి | శారీరక వృద్ధిని, గుడ్ల ఉత్పత్తిని ప్రభావితం చేస్తాయి. కోళ్ళను ఆరోగ్యంగా ఉంచుతాయి. | ఈగ గుడ్లు, క్రిములు, పురుగులు, చేపలు, మాంసపు వ్యర్థాలు, చేపల పొట్టు, పెండలం/సుబాబులు వంటి మొక్కల ఆకులు, బఠానీ, బీన్స్, ఆయిల్ కేకులు, తాటి, కొబ్బరి టెంకలు వంటివి |
| 3 | ఖనిజ పోషకాలు అందించేవి | ఎముకలు, గుడ్డు పెంక నిర్మాణానికి తోడ్పడతాయి. కోళ్ళ ఆరోగ్యానికి దోహదపడతాయి. | నత్త పెంకులు, ఎముకల పొట్టు, కాల్చిన గుడ్డు పెంకులు వంటివి |
| 4 | విటమిన్లు అందించేవి | శారీరక వృద్ధి, గుడ్ల ఉత్పత్తికి సాయపడతాయి. గుడ్లు పొదిగే సామర్థ్యం పెరుగుతుంది. | మునగ ఆకులు, కూరగాయలు, అజోలా, సూర్యరశ్మి, పచ్చటిగడ్డి, పచ్చిమేత వంటివి |

### బి). గుడ్లు పెట్టడం /పొదగడం:

కోళ్ళు గుడ్లు పెట్టడానికి వీలుగా వాటికి గూళ్ళు అందుబాటులో ఉంచాలి. కోళ్ళు పెంచేవాళ్ళు ఎక్కువ కోళ్ళు ఒకేసారి గుడ్లు పెట్టేరీతిలో తగినన్ని గూళ్ళు/అరలు సిద్ధంగా ఉంచాలి. స్థానికంగా, సులువుగా దొరికే వెదురు బుట్టలు, కలప అరలు, పగిలిన కుండలు వంటి వాటితో గూళ్ళు/అరలు తయారుచేయవచ్చు. ఇక పొదగడానికి కోడి పెట్టలకు కాస్త చీకటి, నిశ్శబ్దం ఉండే చోట్ల విడిగా పొదిగే గూళ్ళు/అరలు ఏర్పాటు చేయాలి. దానివల్ల పొదిగే కోళ్ళకు మనుషుల నుంచి, ఇతర కోళ్ళ నుంచి ఏ రకమైన

ఇబ్బంది లేకుండా ఉంటుంది. పొదిగే గూళ్ళు/అరలు చేయడానికి కూడా వెదురు బుట్టలు/ మట్టి పాత్రలు/ చెక్క బాక్సులు వంటివి వాడవచ్చు. వాటిలో 1/3 వంతు ఎత్తు మేర ఇసుక, బూడిద కలిపి పేర్చాలి. దానిపైన 2/3 వంతు ఎత్తు మేర ఎండు గడ్డి/ మెత్తటి పీచు పరచాలి. దీని మీద పొదగడానికి పెట్టిన గుడ్లను ఉంచాలి. గుడ్ల దగ్గరికి పురుగులు చేరకుండా, గూళ్ళు/అరలు తయారుచేసే మెటీరియల్‌కు బూడిద, పొగాకు ఆకులు, వేప ఆకులు, ఎండు నిమ్మ వంటి పదార్థాలు కలిపితే గుడ్లు క్షేమంగా ఉంటాయి. బయటి నుంచి వచ్చే పురుగుల బెడద తప్పుతుంది. దాంతో పొదుగు సామర్థ్యం పెరుగుతుంది.

### సి). కోడి పిల్లల నిర్వహణ-యాజమాన్యం:

కోడి పిల్లలకు (రిస్కు ప్రమాదం ఎక్కువగా ఉంటుంది) రోగాలు తొందరగా అంటుకుంటాయి. ఇతర జంతువుల నుంచి ఉండే ప్రమాదం కూడా ఎక్కువే. అందుకని పెంపకందార్లు కోడి పిల్లల నిర్వహణ-యాజమాన్యం పరంగా ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. షెల్టర్‌లో పెట్టేటప్పుడు వాటిని ప్రత్యేకమైన ప్రదేశంలో తల్లి కోడి దగ్గర ఉండేలా చూడాలి.

### డి). తాగునీరు:

కోళ్ళకు ప్రతి రోజూ పరిశుభ్రమైన నీటిని రోజుకు కనీసం రెండుసార్లు అందేలా చూడాలి. పరిశుభ్రమైన పాత్రల ద్వారా వాటిని అందించాలి. ఇలా చేయడం వల్ల అపరిశుభ్రంగా ఉండే 'నల్లా'ల వంటి దగ్గర అవి నీళ్ళు తాగకుండా ఉంటాయి. దాంతో నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల బారిన పడకుండా వాటిని కాపాడుకోవచ్చు.

### ఇ). చెల్లింపుల ఆధారిత టీకా సేవలు:

దేశీ కోళ్ళను పెంచేవాళ్ళు ఆ కోళ్ళకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. ముఖ్యంగా కొక్కెర రోగం (రాణీఖేత్), అమ్మతల్లి (ఫౌల్ పాక్స్) రోగాలకు టీకాలు వేయించడం తప్పనిసరి. శిక్షణ పొందిన వ్యాక్సినేటర్ల ద్వారానే ఈ టీకాలు వేయించాలి. ఇలా కోళ్ళకు టీకాలు వేయించడానికి గాను పెంపకందార్లు తమ ఉమ్మడి ప్రయోజనాల బృందం (సి.ఐ.జి) ద్వారా కోళ్ళ నిధికి తమ వాటా మొత్తాలను (అడ్వాన్సు చెల్లింపులు) జమ చేస్తూ ఉండాలి.

### ఎఫ్). రికార్డుల నిర్వహణ:

కుటుంబ స్థాయిలో కోళ్ళ పెంపకానికి సంబంధించి అన్ని వివరాలను సరైన రీతిలో నమోదు చేసేందుకు అనువైన ఒక వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి. పెంపకం పరంగా కోళ్ళ మందులు, టీకాలు, ఆరోగ్య సంరక్షణ సేవల సరళి వంటి అంశాలను సమగ్రంగా ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. ఉత్పత్తి వ్యవస్థలను మెరుగుపరచడం, టీకాల కాల వ్యవధి, తాము పెట్టిన పెట్టుబడుల పరంగా తమకు అందుతున్న ఆర్థిక ప్రయోజనాలను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకోవడానికి ఇది పెంపకందార్లకు ఉపయోగపడుతుంది.

## 2. కోళ్ళకు వచ్చే సాధారణ వ్యాధులు

జాతి కోళ్ళు, ఇతర కోళ్ళతో పోలిస్తే, దేశీయ కోళ్ళకు వ్యాధులు, రోగాలను తట్టుకునే శక్తి ఎక్కువగానే ఉంటుంది. అయినప్పటికీ, బ్రీడింగ్ ఫారం దగ్గర సరైన స్థాయిలో ఆరోగ్య సంరక్షణ, యాజమాన్య ఏర్పాట్లు ఉండేలా చూడాలి. జీవాలు బయటి వాతావరణంలో తిరుగుతూ ఉంటాయి కాబట్టి, బ్రీడింగ్ ఫారంలో తగిన జీవ సంరక్షణ ఏర్పాట్లు ఉండాలి. దాంతో వ్యాధులు, రోగాలపరంగా కోళ్ళ మందకు ఉండే రిస్కు/ప్రమాదం తగ్గించవచ్చు. వీటికి అవి తినే దాణా/ఆహారం, నీళ్ళు, విసర్జితాలు, క్రూరమైన పక్షులు, కుక్కలు, పురుగులు, ఎలుకలు, పిల్లులు, వాహనాలు, ఉపకరణాలు, మనుషుల వల్ల ప్రమాదం ఉంటుంది. వీటివల్ల వ్యాధులు, రోగాలు కూడా వ్యాపిస్తాయి. బయటినుంచి తెచ్చే కోళ్ళ వల్ల కూడా వ్యాధులు, రోగాలు వ్యాపిస్తాయి. ఇలాంటివన్నీ దృష్టిలో పెట్టుకుని, కోళ్ళ మందలో వ్యాధులు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

# దేశీ కోళ్ళకు వచ్చే ముఖ్యమైన వ్యాధులు/రోగాలు

**వ్యాధి (సాధారణ పేరు)**

కొక్కెర రోగం

రోగ కారకం

వైరస్

**లక్షణాలు**

* పసుపు /ఆకుపచ్చ విరేచనాలు
* మెడ వంకరపోవడం
* అవయవాలు పనిచేయకపోవడం
* శ్వాస సంబంధిత ఇబ్బందులు
* పడిపోవడం



**వ్యాధి (సాధారణ పేరు)**

అమ్మ తల్లి

రోగ కారకం

వైరస్

**లక్షణాలు**

* కోడి జుత్తు, ముఖం, ఫించం పైన పండ్ల లాంటి బొడిపెలు
* నోరు, స్వర పేటిక, గొంతు/మెడ భాగంలో పొక్కులు
* స్వర పేటిక వద్ద గోధుమ రంగు మచ్చలు. తీసేస్తే, కొరిగినట్టు కనపడుతుంది.



**వ్యాధి /రోగం పేరు (సాధారణ పేరు)**

మారేక్స్ వ్యాధి

రోగ కారకం

వైరస్

**లక్షణాలు**

* శ్వాస ఇబ్బందులు, బద్ధకం, పక్షవాతం
* సమన్వయం లేకపోవడం, అంధత్వం
* జుత్తు, చెవుల దగ్గర పాలిపోయినట్టు ఉండడం
* ఆకుపచ్చ విరేచనాలు



**వ్యాధి (సాధారణ పేరు)**

జలుబు, శ్వాస పరమైన ఇబ్బందులు

వ్యాధి కారకం

బాక్టీరియా/వైరస్



**లక్షణాలు**

* ఆకుపచ్చ విరేచనాలు కళ్ళు, ముఖం నీటితో ఉబ్బినట్టు ఉండడం
* ముక్కు కారడం
* కనురెప్పలు చర్మం తో కప్పబడి ఉండడం
* ఊపిరి ఎగబోయడం
* శ్వాస సమయంలో గురక లాంటి శబ్దాలు

**వ్యాధి (సాధారణ పేరు)**

తెల్లటి జిగట విరేచనాలు

వ్యాధి కారకం

సాల్మోనెల్లా



**లక్షణాలు**

* చీము కారే దగ్గర తెల్లటి జిగట
* బలహీనంగా ఉంటాయి. కోళ్ళ మంద షెడ్ లో ఒక మూలకు చేరుతుంది.

**వ్యాధి (సాధారణ పేరు )**

కాక్సిడాయిస్

వ్యాధి కారకం

ప్రోటోజోవ



**లక్షణాలు**

* రక్త విరేచనాలు
* ముడ్డి దగ్గర రక్తం

**వ్యాధి (సాధారణ పేరు)**

అంతర్కీటకాలు

వ్యాధి కారకం

నులిపురుగులు



**లక్షణాలు**

* బలహీనం, రక్తహీనత
* మలం, పేగుల్లో పురుగులు

వ్యాధి (సాధారణ పేరు )

బయటి పరాన్న జీవులు

వ్యాధి కారకం

పేలు, పురుగులు

లక్షణాలు

* చికాకు వల్ల వృద్ధి మందగిస్తుంది. ఆకలి తగ్గుతుంది.



వ్యాధి (సాధారణ పేరు)

పారుడు రోగం

వ్యాధి కారకం

బాక్టీరియా

లక్షణాలు

* విరేచనాలు, తెగిన ఈకలు, అకలి, దప్పిక
* పసుపు పచ్చటి విరేచనాలు, కదలడానికి ఇష్టపడవు




వ్యాధి (సాధారణ పేరు)

వడ దెబ్బ

వ్యాధి కారకం

అధిక ఉష్ణోగ్రత

లక్షణాలు

* ఎక్కువ దాహం వేయడం
* డీ హైడ్రేషన్



వ్యాధి (సాధారణ పేరు)

కోళ్ల కలరా

వ్యాధి కారకం

బాక్టీరియా (పాశ్చురెల్లా)

లక్షణాలు

* ఆకుపచ్చ విరేచనాలు, ఊదా రంగులో జుత్తు, ఫించం, ఉబ్బిన ఫించం, ముడతలు పడిన ఈకలు, ఉబ్బిన కీళ్ళు, బద్ధకం, అకస్మాత్తుగా చనిపోవడం
* ఆహారం/దాణా/ నీళ్ళు/ఉపకరణాలు ద్వారా వ్యాధి వ్యాపిస్తుంది.



త్వరగా వ్యాపించే కొక్కెర, అమ్మతల్లి, మారేక్స్ వంటి వ్యాధులను నియంత్రించడానికి టీకాలు అందుబాటులో ఉన్నాయి. సకాలంలో టీకాలు వేయడం, కోళ్ళు ఉండే చోట పరిశుభ్రత మెరుగుపర్చడం, పరిశుభ్రమైన తాగునీటిని అందుబాటులో ఉంచడం వంటి చర్యల ద్వారా కోళ్లలో రోగాలు/వ్యాధుల వ్యాప్తిని బాగా నియంత్రించవచ్చు..

## కోళ్ళకు వచ్చే కొన్ని ప్రధాన వ్యాధుల నియంత్రణకు టీకాల షెడ్యూల్ పట్టిక:

| క్రసం | వయసు | వివరాలు |
|---|---|---|
| 01 | 7వ రోజు | కొక్కెర రోగ నియంత్రణకు 'లాసోటా' టీకా - I/O or I/N |
| 02 | 14వ రోజు | కొక్కెర రోగ నియంత్రణకు 'లాసోటా' టీకా - I/O or I/N |
| 03 | 8వ వారం | అమ్మతల్లి రోగ నియంత్రణకు 'అమ్మ తల్లి' టీకా - I/O or I/M |
| 04 | 9వ వారం | కొక్కెర రోగ నియంత్రణకు ఆర్.డి.వి.కే. టీకా - S/C or I/M |
| 05 | 18వ వారం | కొక్కెర రోగ నియంత్రణకు ఆర్.డి.వి.కే. టీకా - S/C or I/M |
| 06 | దేశీ కోళ్ళు (పెద్దవి) | లసోటా మందును నీళ్లలో కలిపి, ప్రతి 3 నెలలకు ఒకసారి దేశీ కోళ్లకు ఇవ్వాలి. లసోటా టీకా వేసే ఒక వారం రోజుల ముందు నట్టల మందు (డీ వార్మింగ్) వేయాలి. |
| | కె.వి.కే. నమ్మక్కాల్ సూచించిన టీకాల షెడ్యూల్ | |

### సంబంధిత మదింపు అంశాలు (ఏవైనా ఉంటే)

| నేర్చుకునే కాల వ్యవధి | థియరీ/బోధన (3 గంటలు) | ఆచరణాత్మక ప్రయోగాలు/ ప్రాక్టికల్స్ (2 గంటలు) |
|---|---|---|
| ఆలోచనా సరళికి విశ్లేషణ/మదింపునకు అనువైన ప్రశ్నలు | విజ్ఞానం/నైపుణ్య సంబంధిత ప్రశ్నలు:<br>1. కోళ్ళలో వ్యాపించే వ్యాధుల పేర్లు తెలపండి.<br>2. శక్తి, ప్రోటీన్లు ఎక్కువగా ఇచ్చే ఆహార పదార్థాల పేర్లు చెప్పండి.<br>3. అజోలా గుంత ఎలా తయారు చేస్తారు<br>4. రాత్రి వసతి ఏర్పాటు ప్రాధాన్యత తెలపండి. | |
| | విశ్లేషణ/మదింపునకు అనువైన ప్రశ్నలు<br>1.<br>2. | |

## సెషన్ ఎక్సర్ సైజ్ / కేస్ స్టడీ

ఈ కింద తెలిపిన అంశాలపై గ్రూపు ఎక్సర్ సైజులు

1. ఎంత ఆహారం/దాణా ఇవ్వాలనేదానిపై ఎక్సర్ సైజులు
2. రోగ/వ్యాధి నియంత్రణ ఏర్పాట్లపై ఎక్సర్ సైజులు
3. విభిన్న రకాల రోగాలు/వ్యాధులను గుర్తించడం
4. పనుల క్యాలెండర్ తయారీ

## నేర్చుకునే కీలక అంశాలు - విశ్లేషణ

1. రోగాలు/వ్యాధులు-వాటి లక్షణాల గుర్తింపు
2. అందుబాటులో ఉన్న ముడిపదార్థాలకు అనుగుణంగా ఇవ్వవలసిన ఆహారం/దాణా
3. అజోలా, ఆహార క్రిముల పెరుగుదల వంటివి
4. తాగునీటి ఏర్పాట్లు

****

# సెషన్ 4 - వ్యాపారపరంగా బ్రీడింగ్ ఫారం ఏర్పాటు ప్రక్రియ

## సెషన్ మార్గదర్శిని:

**కోర్సు** : **గ్రామీణ ప్రాంతాల్లో పెరటికోళ్ల పెంపకం - పరిచయం**

సెషన్ నెం., పేరు : ఔత్సాహిక వ్యాపారంగా బ్రీడింగ్ ఫారం ఏర్పాటు

సెషన్ ఉద్దేశాలు

(అభ్యాసకుల మార్గదర్శిని) : వ్యాపారపరంగా బ్రీడింగ్ ఫారం ఏర్పాటు ప్రక్రియ

**సెషన్ లోని స్థూల అంశాలు**

**(అభ్యాసకుల మార్గదర్శిని)** :

గ్రామీణ భారత దేశంలో దేశీ/దేశీయ కోళ్ళకు బాగా ప్రాధాన్యత ఉన్నది. అయితే వాటికి సంబంధించిన పెరటి కోళ్ళ ఉత్పత్తి వ్యవస్థల మెరుగుదలకు అవసరమైన సహాయక సేవల మద్దతు మాత్రం తగిన స్థాయిలో లేదు. గ్రామ స్థాయిలో దేశీ కోళ్ళ పెంపకానికి అవసరమైన స్థాయిలో కోడి పిల్లలను సరఫరా చేసే సంఘటిత వ్యవస్థ లేదు.

ఔత్సాహిక వ్యాపారంగా బ్రీడింగ్ ఫారం ఏర్పాటును ప్రోత్సహించడం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం – దేశీ/దేశీయ కోళ్ళ ఉత్పత్తి కేంద్రాలను స్థానిక స్థాయిలో వికేంద్రీకరించడం, తద్వారా దేశీ కోళ్ళ పెంపకందార్లకు నిరంతరంగా కోడి పిల్లలను సరఫరా చేసే ఒక సప్లయ్ చైన్ వ్యవస్థను సృష్టించడం. ఇలా ఏర్పాటు చేసే బ్రీడింగ్ ఫారం తొలిదశలో కొన్ని గ్రామాల క్లస్టర్ పరిధిలో కనీసం 100–200 కుటుంబాలకు సేవలు అందించగలుగుతుంది. ఆ క్లస్టర్ పరిధిలో దేశీ కోళ్ళ పెంపకానికి ముందుకు వచ్చే ఆయా కుటుంబాలకు కోడి పిల్లలు/పెరిగిన కోళ్ళను వ్యాపారాత్మకంగా సరఫరా చేస్తుంది. కాలక్రమేణా, డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను పెంచుకోవచ్చు.

### బ్రీడింగ్ ఫారం ఔత్సాహిక వ్యాపార వేత్త ఎంపికకు ప్రామాణికాలు:

* ఏడాది పొడవునా ప్రతి రోజూ బ్రీడింగ్ ఫారం కార్యకలాపాలు చూసుకునేందుకు కుటుంబంలో ప్రత్యేకంగా ఒక వ్యక్తి అందుబాటులో ఉండడం.
* దేశీ కోళ్ళ పెంపకంలో పూర్వ అనుభవం ఉన్న వ్యక్తి (10–15 కోళ్ళను పెంచిన అనుభవం)
* బ్రీడింగ్ ఫారం ఏర్పాటు కోసం స్వంతంగా పెట్టుబడి పెట్టగలిగే సామర్థ్యం కలిగి ఉండడం
* బ్రీడింగ్ ఫారం ఏర్పాటునకు 2000 చదరపు మీటర్ల స్థలం కలిగి ఉండడం (వీలయితే సహజమైన నీడను ఇచ్చే మొక్కలు ఉన్న స్థలం)
* రికార్డు పుస్తకాలు./ఖాతాలు నిర్వహించగలగడం
* బ్రీడింగ్ ఫారం నిర్వహణ పరంగా అన్ని యాజమాన్య పద్ధతులు పాటించడానికి అంగీకరించడం
* ఏదైనా స్వయం సహాయక బృందం (ఎస్.హెచ్.జి.) /ఉమ్మడి ప్రయోజనాల బృందం (సి.ఐ.జి) కోళ్ళ పెంపకందార్ల నెట్ వర్క్ / అసోసియేషన్ (ఏదైనా స్థానిక సంస్థలో) ఆమె /అతడు సభ్యులై ఉండడం

## మౌలిక సదుపాయాలు

కోడి పిల్లలు, ఎదిగే పిల్లలతో కలిపి 50 కోడి పెట్టలు, 10 కోడి పుంజులు కలగలసిన కోళ్ళ మంద నిర్వహణకు గాను, బ్రీడింగ్ ఫారంలో ఈ కింద తెలిపిన మౌలిక సదుపాయాలు ఉండాలి.

### 1. కోళ్ళు మేసే ప్రాంతాలు -


బ్రీడింగ్ ఫారంలో కోళ్ల ఉత్పత్తి వ్యవస్థ పరంగా అవి బయట కూడా మేసి తినేందుకు వీలు కలిగించే రీతిలో కొంత ఏర్పాటు ఉంటుంది. ఫారం లోపల అవసరమైన మౌలిక సదుపాయాలు, బయట తిరిగి మేసే మేత సౌకర్యాలు వంటివి ఏర్పాటు చేయడానికి కనీసం 2000 చదరపు మీటర్ల (0.5 ఎకరాలు) విస్తీర్ణంలో భూమి అవసరం. ఈ పాటి విస్తీర్ణంలో భూమి కోళ్ళను పెంచేవారి ఇంటి పెరట్లోనే ఉంటే ఇంకా మంచిది. పెంచే కోళ్ళను మరింత జాగ్రత్తగా కాపాడుకోవడానికి అది ఉపయోగపడుతుంది. ఒకవేళ ఆ పాటి భూమి లేకపోతే, పెంపకందారు తను పెంచే కోళ్ళ మందలో కోళ్ళ సంఖ్యను కొంతమట్టుకు తగ్గించుకోవచ్చు. తగినంత స్థలం అందుబాటులో ఉన్నప్పుడు ఆ కోళ్ళ సంఖ్యను క్రమంగా మళ్ళీ పెంచుకోవచ్చు. కోళ్ళు మేసే ప్రాంతంలో ఎక్కువ రకాల మొక్కలు ఉండాలి. దానివల్ల కోళ్ళకు సహజమైన రీతిలో నీడ దొరుకుతుంది. వేసవి కాలంలో బయటి వేడిని తగ్గించడానికి కూడా మొక్కలు ఉపయోగపడతాయి. నీడనిచ్చే మొక్కలతో పాటుగా, అవి మేత మేసే ప్రాంతంలో, మధ్యాహ్న సమయంలో అవి ఒకచోట చేరి సేద తీరడానికి గాను చిన్న చిన్న గుడిసెల్లాంటి 'రెస్ట్ షెడ్స్' (4-5) ఉండేలా చూడాలి. మేత మేసే ప్రాంతంలోనూ, వాటి సమీప ప్రాంతంలోనూ కోళ్ళ కోసం తాగునీటి ఏర్పాట్లు చేయాలి.

### 2. కంచె -

కోళ్ళు మేత మేసే మొత్తం ప్రాంతం అంటే 2000 చదరపు మీటర్ల విస్తీర్ణం చుట్టూతా సరిహద్దుల వెంబడి, కంచె వేయాలి. కోళ్ళకు ఇతర జంతువుల నుంచి ప్రమాదం కూడా ఎక్కువే. ముఖ్యంగా అటవీ సరిహద్దు ప్రాంత గ్రామాలలో ఈ రిస్కు ఎక్కువగా ఉంటుంది. అందుకని, బ్రీడింగ్ ఫారంలో మేత మేసే ప్రాంతం చుట్టూ కంచె వేసి ఆ రిస్కును తగ్గించుకోవచ్చు. దీర్ఘకాలంలో, బ్రీడ్ ఫారం సరిహద్దుల వెంబడి గ్లైరిసీడియా, కానుగ వంటి మొక్కలతో జీవ కంచె ఏర్పాటు చేసుకోవచ్చు, ఈ జీవ కంచెతో పాటుగా చేపలు లేదా పావురాలు పట్టే వలలు లేదా వెదురు ముక్కలు/ తాటి చెట్టు ఆకులతో బ్రీడింగ్ ఫారం సరిహద్దులను మూసేస్తే, కోళ్ళకు ప్రమాదం కలిగించే ఇతర జంతువులు కోళ్ళు మేత మేసే ప్రాంతంలోకి రాకుండా ఉంటాయి. కంచెలో ఎక్కడ కూడా రంధ్రాలు లేకుండా చూడాలి. పిల్లులు, కుక్కలు వంటివి చొరబడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

#### 1. షెల్టర్ -

బ్రీడింగ్ ఫారం ప్రదేశం అంతా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవడం అన్నింటికన్నా ముఖ్యం. చెడు వాతావరణం, కోళ్ళను తినేసే జంతుజీవులు, దొంగతనం వంటివాటి వల్ల కోళ్ళకు ఎలాంటి ప్రమాదం లేకుండా చూసుకోవాలి. షెల్టర్ లోపల వేర్వేరు కోళ్ళను వేర్వేరుగా పెట్టడానికి వీలుగా, తగిన రీతిలో తగినన్ని అరలు ఏర్పాటు చేయాలి. వరి గడ్డి/పొట్టు వంటివి నేల మీద అక్కడక్కడా అందుబాటులో



ఉంచాలి. దీనిని క్రమం తప్పకుండా మారుస్తూ ఉండాలి. షెల్టర్ నేల మీద తిండి గింజలను పెట్టేముందు ఆ ప్రాంతంలో సున్నపుపూత పూయాలి.

షెల్టర్ లోపల ఒక ప్రాంతాన్ని ప్రత్యేకంగా తల్లి కోడి, వాటి పిల్లలు ఉండేలా తగిన ఏర్పాట్లు చేస్తే, పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు వాటిని జాగ్రత్తగా చూసుకోవచ్చు. వాటికి ఇతర జీవాల వల్ల ఎటువంటి గాయాలు కాకుండా చూసుకోవచ్చు. (కోడి పిల్లల పెంపకం – వాటి యాజమాన్యం అనే అధ్యాయంలో దీనికి సంబంధించి మరిన్ని వివరాలు ఉన్నాయి)

### షెల్టర్ నిర్మాణానికి సూచనలు

* చవకైన, మన్నికైన స్థానిక మెటీరియల్ (వెదురు, కలప, రెల్లు, తాటిగ్రాసం బంకమట్టి, సిమెంట్ కలిసిన ఇటుకలు వంటివి)వాడాలి.
* లోపలికి తగినంత వెలుతురు, సూర్యరశ్మి వచ్చే రీతిలో గోడ కోసం ప్లాస్టిక్ కోటెడ్ వైర్ మెష్ వాడాలి.
* ఫ్లోర్ కాంక్రీట్ (సిమెంట్, ఇసుక, బురద మట్టి మిశ్రమంతో కూడినది) కావచ్చు లేదా ఎండుగ్రాసం, విరిపొట్టుతో కప్పిన పేడ మట్టి ఫ్లోరింగ్ కావచ్చు.
* పై కప్పు మీద రెల్లు గడ్డి లేదా వరిగడ్డి పొరలుగా కప్పాలి.
* ఎదిగే కోళ్ళు లేదా పెద్ద కోళ్ళు రాత్రి పూట ఉండడానికి వీలుగా తగినన్ని కడ్డీ కొమ్మలు ఉంచాలి.
* తల్లి కోడి- వాటి పిల్లలు, పొదిగే గూళ్ళు, గుడ్లు పెట్టే అరలు విడివిడిగా ఉండే రీతిలో షెల్టర్ ప్రాంతాన్ని విభజించాలి.
* ఇతర జీవాల నుంచి కోళ్లకు ప్రమాదం లేకుండా ఉండేందుకు గాను షెల్టర్ సమీప ప్రాంతంలో పొదలు, గడ్డి కుప్పలు లేకుండా చూసుకోవాలి.
* షెల్టర్‌లో ఎక్కడా ఎటువంటి రంధ్రాలు లేకుండా చూసుకోవాలి.

అదే రీతిలో, గుడ్లు పొదిగే కోళ్ళ కోసం విడిగా షెల్టర్ లో ఒక భాగం కేటాయించాలి. ఆ ప్రాంతలో బట్టలు/గ్రీన్ నెట్స్ వంటివి వేసి ఉంచాలి. దీనిని కోళ్ళు పొదిగే ప్రాంతంగా చూడాలి. ఈ ప్రాంతంలో నేల మీద కానీ లేదా వేలాడదీస్తూ కానీ, 15–20 బుట్టలు లేదా గూళ్ళు పెట్టాలి. వీటిలోపల కొంతమట్టుకు గడ్డి, ఇసుక, ఇతరత్రా బెడ్డింగ్ మెటీరియల్ ఉంచాలి. పొదిగే కోళ్ళకు అందుబాటులో ఉండే రీతిలో దాణా, పరిశుభ్రమైన తాగు నీళ్ళు కూడా అక్కడ ఉంచాలి. ఈ ప్రదేశాన్ని మూసి వేసి ఉంచడం మంచిది. అప్పుడు పొదిగే కోళ్ళకు ఇతర జీవాల నుంచి ఎలాంటి అసౌకర్యం ఉండదు. కోళ్ళు పొదిగిన తరువాత, ఈ బుట్టలు/గూళ్ళు తీసి శుభ్రంగా కడిగి, ఆరబెట్టాలి. అలా చేసిన తరువాతనే, వాటిని వేరే కోళ్ళకు పొదగడానికి వాడాలి.

ఇక షెల్టర్ లో మూడవ విభాగం – దీనిని గుడ్లు పెట్టే కోళ్ళ కోసం వినియోగించాలి. ఇక్కడ 12–15 వరకు గుడ్లు పెట్టే బాక్సులు / బుట్టలు/ అరలు ఉండేలా చూడాలి. ఈ అరలను సన్నటి /పలచటి షీట్ తో కప్పి ఉంచితే మంచిది. ఇలా చేయడం వల్ల కోళ్ళకు ఒక నిర్దిష్ట ప్రాంతంలో గుడ్లు పెట్టడం అలవాటు అవుతుంది. పెంపకందారు గుడ్లను ఏరుకోవడం కూడా సులువవుతుంది. గుడ్లు పగలకుండా/చెడిపోకుండా ఉండడానికి కూడా ఇది తోడ్పడుతుంది.

నాలుగో విభాగంలో ఇతర కోళ్ళను పెట్టవచ్చు. షెల్టర్ లోని ఈ విభాగంలో కోళ్ళు రాత్రిపూట విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా కడ్డీలు పెట్టాలి. ఎదుగుతున్న కోళ్ళు, పుంజులు, గుడ్లు పెట్టని కోళ్ళను ఈ కడ్డీల మీద పెట్టవచ్చు.

షెల్టర్ ప్రాంతాన్ని, అందులో ఉంచే కడ్డీలు, గుడ్ల బాక్సులు/బుట్టలు, పొదిగే గూళ్ళు/బుట్టలు వంటివాటిని క్రమం తప్పకుండా శుభ్రపరుస్తూ ఉండాలి. గోడలు, కడ్డీలు/కమ్మీలు, తలుపులకు ఏడాదికి కనీసం రెండుసార్లు సున్నం పూత పూయాలి. ఏవైనా వ్యాధులు/రోగాలు తీవ్ర స్థాయిలో ప్రబలినప్పుడు కూడా వీటికి తప్పనిసరిగా సున్నపు పూత వేయించాలి.

### మేత/దాణా వనరుల అభివృద్ధి -


బ్రీడింగ్ ఫారం లోపల దేశీ కోళ్ళు బయటనే తిరుగుతూ, వ్యర్థ గింజలు, చిన్న చిన్న పురుగులు, క్రిములను తింటూ ఉంటాయి. ఆ ప్రాంతంలో చల్లిన గింజలు, వ్యర్థపు ఆహారం (కిచెన్ వేస్ట్), ఆకుకూరలు వంటివి తింటాయి. ఈ కోళ్ళ ద్వారా ఎక్కువ లాభాలు అందుకోవాలంటే, బ్రీడింగ్ ఫారం లోపల మేత వనరులు పుష్కలంగా ఉండేట్టు చూసుకోవాలి. దానికి అనుగుణమైన ఏర్పాట్లు చేసుకోవాలి. **కోళ్ళకు ప్రధానంగా నాలుగు రకాల ఆహారం/దాణా అవసరమవుతుంది:** అవి - శక్తి నిచ్చేవి, ప్రోటీన్లు ఇచ్చేవి, ఖనిజ పోషకాలు, విటమిన్లు. ఈ నాలుగు రకాల ఆహారం/ దాణా వనరులు బ్రీడింగ్ ఫారంలో అందుబాటులో ఉండేలా చూడాలి.

| బ్రీడింగ్ ఫారం కోసం కోళ్ళ ఎంపికకు సూచనలు |
|---|
| * పరిశుభ్రమైన, మెరిసే ఈకలు |
| * పరిశుభ్రమైన, ఎండిన ముక్కు, ముక్కు రంధ్రాలు |
| * చురుకైన, సజీవమైన కదలికలు |
| * పొదిగే కోడి పెట్టలా, కాదా అనేది చూడాలి. |
| * నిటారుగా కాళ్ళు, పాదాలు, మచ్చలు లేకుండా ఉండడం |

## బ్రీడింగ్ ఫారం లో కోళ్ళ పెంపకం పద్ధతులు

**1. కోళ్ళు, జాతుల ఎంపిక -** బ్రీడింగ్ ఫారం లో ఔత్సాహిక వ్యాపారవేత్త తనకున్న మంద ద్వారా కానీ లేదా నాణ్యమైన కొత్తవాటిని కొనడం ద్వారా కానీ, కోళ్ళ మందలో కోళ్ళ సంఖ్యను పెంచుకోవాలని భావిస్తారు. కొత్తగా కొన్నవాటికి అవసరమైన జీవ రక్షణ చర్యలు కూడా తీసుకుంటారు. ఇలా కొత్త కోళ్ళను కొన్నప్పుడు, వాటిని తొలి రెండు వారాల పాటు విడిగా ఒక బుట్టలో కానీ లేదా అరలో కానీ ఉంచాలి. మందలో ప్రతి 10 కోడి పెట్టలకు ఒక పుంజు (10:1) ఉండేలా చూసుకోవడం చాలా ముఖ్యం బ్రీడింగ్ ఫారంను ఆరోగ్యకరమైన కోళ్ళతో మొదలు పెట్టడం ద్వారా అక్కడ వ్యాధులు/రోగాల సమస్యను బాగా నియంత్రించవచ్చు.

**2. గుడ్లు పెట్టడం-** బ్రీడింగ్ ఫారంలో కనీసం 1/3 వంతు కోడి పెట్టలు గుడ్లు పెట్టగలిగేవిగా ఉండాలి (వేసవి కాలంలో తప్ప). కోళ్ళు గుడ్లు పెట్టడానికి వీలుగా వాటికి బుట్టలు/గూళ్ళు అందుబాటులో ఉంచాలి. ఇవి షెల్టర్ లోపలే ఉండాలి. ఒకేసారి ఎక్కువ కోడి పెట్టలు గుడ్లు పెట్టగలిగే రీతిలో షెల్టర్ లో తగినన్ని గుడ్ల బుట్టలు/అరలు ఉండేలా చూసుకోవాలి. స్థానికంగా దొరికే వెదురు, కలప, పగిలిన మట్టి కుండల పాత్రలతో వీటిని తయారు చేసుకోవచ్చు. ఒక బ్రీడింగ్ ఫారంలో కోళ్ళు గుడ్లు పెట్టడానికి కనీసం 15-20 గుడ్ల బుట్టలు/అరలు ఉండాలి.



**3. పొదగడం -** గుడ్లు పొదగడానికి ప్రత్యేకమైన గూళ్ళు/అరలు షెల్టర్ లో ఉండాలి. అవి కాస్త ప్రశాంతంగా ఉండే చోట, కొంత చీకటిగా ఉండే చోట ఉండాలి. దానివల్ల పొదిగే కోళ్ళకు ఇతర జీవాల నుంచి ఎలాంటి అసౌకర్యం ఉండదు. పొదగడానికి, పొదిగిన పిల్లలను పెంచడానికి వెదురు బుట్టలు/మట్టి కుండలు/చెక్క పెట్టెలు వంటివి వాడవచ్చు. వీటిలోపల 1/3వంతు ఎత్తు మేర ఇసుక, బూడిద కలిపి పోయాలి. దానిమీద 2/3 ఎత్తు మేర ఎండిన గడ్డి/గ్రాసం పరవాలి. దానిమీద పొదగడానికి గుడ్లను పెట్టాలి. గూళ్ళ దగ్గర పురుగులు రాకుండా ఉండేందుకు గాను, వాటిని తయారుచేసే పదార్థాలకు బూడిద, పొగాకు ఆకులు, వేప ఆకులు, ఎండు నిమ్మ వంటివి కలిపితే మంచిది. దానివల్ల పొదుగుదల సామర్థ్యం పెరుగుతుంది.


### 4. కోడి పిల్లల యాజమాన్యం -

కోడి పిల్లలకు వ్యాధులు/రోగాలు సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వాటిని తినే ఇతర జీవాలతో కూడా ప్రమాదం ఎక్కువే. అందుకని బ్రీడింగ్ ఫారంలో కోడి పిల్లల యాజమాన్యానికి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలి. పిల్లలను ఎల్లప్పుడూ వాటి తల్లితోనే ఉండేలా చూడాలి. షెల్టర్‌లో విడిగా ఒక అరలో ఉంచవచ్చు. కోడి పిల్లల పెంపకంలో ఏయే వయసులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనేద ఈ కింద వివరించబడింది.



ఎ. 0 –1 వారాలు – ఇది రిస్కు ఎక్కువగా ఉండే కాలం. తొలి వారం రోజుల పాటు పిల్లలను తల్లితోనే ఉంచుతూ కాపాడాలి. ఉష్ణోగ్రతను కూడా తట్టుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. గుడ్లను పొదిగిన తల్లికి తన పిల్లలకు ఎప్పుడు ఎంత ఉష్ణోగ్రత అవసరం అనేది తెలుస్తుంది. పిల్లలు చేసే ధ్వనులను బట్టి అది ఆ విషయం గమనిస్తూ ఉంటుంది. ఈ దశలో పెంపకందారు కోడి పిల్లల కోసం జనపనారతో చేసిన చాపతో బాటు ఒక బుట్ట అందుబాటులో ఉంచాలి. అదే క్రమంలో వాటికి తగినంత దాణా, తాగునీళ్ళు కూడా క్రమం తప్పకుండా అందిస్తూ ఉండాలి. బుట్టను చాపను ప్రతి రోజూ శుభ్రం చేస్తూ ఉండాలి.

బి. 1–3 వారాలు – ఈ దశలో కూడా కోడి పిల్లలను షెల్టర్ లోపలే ఉంచాలి. లేదా ఎప్పుడూ బుట్టలో ఉండేలా చూడాలి. తల్లి కోడిని మాత్రం మేసేందుకు మేత ప్రాంతంలోకి వదలవచ్చు. అయితే తల్లి కోడి ఎప్పుడూ తన పిల్లల చప్పుడు వినగలిగే దూరంలో ఉండాలి. మధ్యమధ్యలో తల్లి కోడి తన పిల్లల దగ్గరికి వచ్చి పోతూ, తిరిగి మేయడానికి వెళ్ళేలా చూడాలి. ఎక్కువ ప్రోటీన్లతో కూడిన దాణా, తాగు నీళ్ళు కోడి పిల్లలకు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలి. కోడి పిల్లలను పెట్టే బుట్టను ప్రతి రోజూ శుభ్రం చేయాలి. రాత్రి పూట తల్లి కోడి, పిల్లలు అన్నీ ఒకేచోట ఉంచాలి.



సి 3–6 వారాలు– ఈ దశలో కోడి పిల్లలు పెరుగుతూ ఉంటాయి. వాటిని మెల్లమెల్లగా బయటికి కొద్దిసేపు బయట మేయడానికి తిరిగేలా వదలాలి. తల్లితో పాటుగా పిల్లలు కూడా బయట తిరుగుతూ ఆహారం వెతుక్కుంటాయి. పొద్దున్న కొన్ని గంటల పాటు వాటిని ఇలా వదిలివేయవచ్చు. అలా వాటిని బయటికి పంపినప్పుడు వాటి మీద ఒక కన్నేసి ఉంచాలి. తరువాత మెల్లమెల్లగా అవి బయట తిరిగే ప్రాంతాన్ని పెంచవచ్చు. కోడి పిల్లలకు ఈ దశలో కూడా మంచి ప్రోటీన్లతో కూడిన దాణాను బుట్టలో అందించాలి. ఎటువంటి పరిస్థితుల్లోనూ, పెద్ద కోళ్ళను ఈ బుట్ట దగ్గరికి పోనీయకూడదు. రాత్రిపూట మాత్రం తల్లి కోడి, పిల్లలు ఒకేచోట ఉంచాలి.

డి. 6 వారాల తరువాత – 6 వారాల తరువాత, బుట్ట ఏర్పాటును తీసివేయాలి. కోడి పిల్లలను పూర్తిగా బయట తిరిగి తినేలా వదలివేయవచ్చు. తల్లితో పాటి ఇతర కోళ్ళ తో కలిసి అవి బయట మేస్తాయి. సాయంత్రం పూట మాత్రం అవసరం మేరకు వాటికి అదనపు దాణా ఇవ్వవచ్చు. 6 వారాల తరువాత 50% కోడి పిల్లలను వేరే కుటుంబాల వాళ్లకు అమ్మేయవచ్చు. కోడిపిల్లలను పంచుకుని పెంచే సాంప్రదాయ పద్దతులు ఏవైనా ఉంటే ఆ రీతిలో ఇతరులకు వాటిని అందించవచ్చు.

### 5. సరైన రీతిలో మంద యాజమాన్యం –

బ్రీడింగ్ ఫారంలో మంద యాజమాన్యం కీలకమైనది. ఫారంలో కోళ్ళు మేయడానికి తగినంత ప్రదేశం (2000 చదరపు మీటర్లు)తో పాటుగా, అన్ని యాజమాన్య పద్ధతులు పాటించడానికి అనువైన సౌకర్యాలు ఉండాలి. బ్రీడింగ్ ఫారంలోని మందలో 50 కోడిపెట్టలు, 10 కోడి పుంజులు ఉండేలా చూసుకోవాలి. కోడి పెట్టల్లో కనీసం వంతి కోళ్ళు గుడ్లు పెట్టేవిగా ఉండాలి. మరో వంతు కోళ్ళు పొదిగేవిగా ఉండాలి. వంతు కోళ్ళు పెంపకం కోళ్ళుగా ఉండాలి. మిగతావి మామూలు కోళ్ళు. ఇలా ఒక పద్ధతి పాటిస్తే, బ్రీడింగ్ ఫారంలో క్రమం తప్పకుండా కోడి పిల్లల ఉత్పత్తి జరుగుతుంది. తన దగ్గర ఉన్న కోళ్ళ మంద యాజమాన్యంపై పెంపకందారు అవసరమైన రీతిలో శ్రద్ధ పెట్టడానికి వీలవుతుంది.

ఎ. 30–45 రోజుల వయసులో 50% కోడి పిల్లలను అమ్మేయడం మంచిది. దానివల్ల బ్రీడింగ్ ఫారంలో కోడి పిల్లల దాణా అవ్సరపు భారం తగ్గుతుంది. 90–100 రోజుల తరువాత అవి కొద్దిగా పెరుగుతాయి. అప్పుడు మరో 25% కోడి పిల్లలను అమ్మేయాలి. మిగతా 25% పిల్లలను పూర్తిగా పెరిగే వరకు పెట్టుకోవచ్చు. వాటిలో కొన్ని కోళ్ళు పొదగడానికి ఉంచుకుని, మిగతావాటిని అమ్మేయవచ్చు.

బి. బ్రీడింగ్ ఫారంలో కోళ్ళు పొడుచుకోవడం ఎక్కువగా ఉన్నట్టు గమనిస్తే, మరిన్ని కోళ్ళను అమ్మివేయడం మంచిది. అయితే ఎదిగే పిల్లలు, కోడి పుంజులను మాత్రమే అమ్మేయాలి. పొదిగే కోళ్ళను మాత్రం ఉంచుకోవాలి. లేదా కోళ్ళు మేత మేసే ప్రాంతం విస్తీర్ణం పెంచాలి. లేదా కోడి పుంజులను వేరేచోటకి మార్చివేయాలి. ఎదిగే కోళ్ళకు, పెట్టలకు దూరంగా వాటిని ఉంచాలి.

### అదనపు దాణా -

బ్రీడింగ్ ఫారంలో కోళ్ళు స్వేచ్ఛగా తిరుగుతూ, మేసే వెసులుబాటు ఉంటుంది. కోళ్ళు ఎక్కువగా అలా బయట తిరుగుతూనే తమ ఆహారం తింటూ ఉంటాయి. ఇలా కోళ్ళు బయట తిరిగిమేసే ప్రాంతంలో వనరులు అక్కడి వాతావరణం, భౌగోళిక స్వరూపం, పచ్చదనం, బ్రీడింగ్ ఫారంలో పాటించే వ్యవసాయ పద్ధతులపై ఆధారపడి ఉంటుంది. బ్రీడింగ్ ఫాంలో కోళ్ళు తినే ఆహారంలో బయట తిరిగి తినే ఆహారం దాదాపు 70–75% ఉండాలి. మిగతా ఆహారాన్ని అదనపు దాణా రూపంలో వాటికి అందించవచ్చు. అయితే ఒక బ్రీడింగ్ ఫాం స్థాయిలో ఎంత అదనపు దాణా ఇవ్వవలసి ఉంటుందనేది అక్కడ లభ్యమయ్యే మేత వనరుల పరిమాణంపై ఆధారపడి ఉంటుంది.

మామూలుగా కోడి పిల్లలకు చిన్న వయసులో అదనపు దాణా అవసరమవుతుంది. ఎందుకంటే, ఆ వయసులో అవి తమ ఆహారాన్ని స్వంతంగా వెతుక్కోలేవు.

***ఏయే వయసులో కోడి పిల్లలకు/కోళ్ళకు ఎంత అదనపు దాణా ఇవ్వవలసి ఉంటుందనేది ఈ కింద పట్టికలో ఉన్నది:***

| క్రసం | వయసు (వారాలు ) | బయట తిరిగి మేసే కోళ్ళకు అవసరమయ్యే అదనపు దాణా /రోజుకి (గ్రా.లో భారం) |
|---|---|---|
| 1 | వారం 1 | 10-15 గ్రాములు |
| 2 | వారం 2 | 15-20 గ్రాములు |
| 3 | వారం 3 - 4 | 20-25 గ్రాములు |
| 4 | వారం 5 - 8 | 30-35 గ్రాములు |
| 5 | వారం 8-27 (ఎదిగే కోళ్ళు) | 30-40 గ్రాములు |
| 6 | 28 వారం నుంచి (పెద్దవి) | 25-30 గ్రాములు |

కోడి పిల్లల యాజమాన్యం విభాగంలో పేర్కొన్న రీతిలో, తొలి 2 వారాల వరకు కోడి పిల్లలకు ప్రోటీన్లతో కూడిన అదనపు ఆహారం/దాణా ఇవ్వాలి. 3-4 వారాల వరకు వాటికి, పైన పట్టికలో తెలిపిన రీతిలో, రోజుకు రెండుసార్లు అదనపు దాణా అందించాలి. కోడి పిల్లకు ఆకలి పెరిగే రీతిలో, వాటిని ఉదయం పూట బయట మేసేందుకు అనుమతించాలి. తరువాత రోజుకు ఇచ్చే అదనపు దాణాలో సగం దాణాను ఉదయం 8-10 గంటల మధ్యలో ఇవ్వాలి. మిగతా సగాన్ని, అవి సాయంత్రం పూట బయట మేసి వచ్చిన తరువాత అందించాలి. తొలుత షెల్టర్ లోపల అదనపు దాణాను ముందుగా కోడి పిల్లలకు ఇవ్వాలి. తరువాత కోడి పెట్టలకు, ఎదిగే పిల్లలకు, కోడి పుంజులకు ఇవ్వాలి.

దాణా వ్యర్థం కాకుండా ఉండడానికి గాను దాన్ని ఫీదర్లు, ఫీడ్ కేఫెటేరియ పద్ధతి ద్వారా అందించడం మంచిది. ప్రతి రోజూ రెండు సార్లు శుభ్రమైన తాగునీరు అందించాలి. ఫీడర్లను, నీళ్ళు అందించే పాత్రలను ప్రతి రోజూ కడగాలి.

బ్రీడింగ్ ఫారంలో తన దగ్గర ఉన్న కోళ్ళకు ఒక వారం రోజుల్లో ఎంత దాణా అవసరం అవుతుంది అనేది పెంపకందారు ముందుగానే లెక్క కట్టాలి. ఆ లెక్క ఆధారంగా నెల రోజులకు అవసరమయ్యే పరిమాణంలో దాణాను ముందుగానే సిద్ధం చేసుకుని ఉంచాలి. తన స్వంత పొలంలో పండించిన ధాన్యాలు ఆధారంగా ఇంటిదగ్గరే పోషకాలతో కూడిన ఈ మిశ్రమ దాణాను తయారు చేసుకోవడం మంచిది.

## బ్రీడింగ్ ఫారంలో అవసరమయ్యే అదనపు దాణా పరిమాణం లెక్క కట్టడం

| రకాలు | కోళ్ల సంఖ్య | ప్రతి రోజూ/ప్రతి కోడికి కావాల్సిన దాణా (గ్రాములు) | ఒక రోజుకు అవసరమయ్యే అదనపు దాణా మొత్తం పరిమాణం (కిలోలు) |
|---|---|---|---|
| **కోడి పిల్లలు** | **100** | **10** | **1 కిలో (100%X10 ÷ 1000)** |
| **ఎదిగే పిల్లలు** | **50** | **20** | **1కిలో (50%X20 ÷ 1000)** |
| **కోడి పెట్టలు** | **50** | **30** | **1.5 కిలో (50%X30 ÷1000)** |
| **కోడి పుంజులు** | **10** | **30** | **0.3 కిలో (10%X30 ÷1000)** |
| **మొత్తం (కిలోలు/ రోజుకు)** | | | **3.8** |
| వారానికి అవసరమయ్యే అదనపు దాణా = 26.6 కిలోలు (అవే సంఖ్యలో కోళ్ళు) | | | |
| ఒక నెలకు అవసరమయ్యే అదనపు దాణా = 114 కిలోలు (అవే సంఖ్యలో కోళ్ళు) | | | |

ఏ పాత్రతోనైతే దాణా ఇస్తామో, అది పూర్తి నిండి ఉన్నప్పుడు దాని భారం లెక్కకట్టాలి. దీనికోసం బ్రీడింగ్ ఫాంలో ఒక చిన్న ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషిన్ అందుబాటులో ఉంచుకోవాలి.మనం ఇచ్చే ఆహారం/దాణాను కొలవడంతో పాటుగా, కోడి పిల్లలు పెరిగే దశలో వాటి బరువును క్రమం తప్పకుండా (ప్రయోగాత్మకంగా) పరిశీలించడానికి ఇది ఉపయోగపడుతుంది.

## మిశ్రమ దాణా తయారీ

బ్రీడింగ్ ఫాంలో కోళ్ళ కోసం ఇంటిదగ్గరే పోషకాలతో కూడిన మిశ్రమ దాణాను తయారుచేసుకోవడం మంచిది. ఇలా తయారుచేసుకునే దాణా ఖర్చు తగ్గించడానికి గాను బ్రీడింగ్ ఫాంలో కోళ్ళు మేత మేసే ప్రాంతం, దాంతో పాటు తన పొలంలోనే మిశ్రమ దాణా తయారీకి అవసరమైన ముడి పదార్థాలు అందేలా చూసుకోవాలి. ఇలా ఇంటి దగ్గర తయారుచేసుకునే మిశ్రమ దాణా కోసం ఏవేవి ఎంతెంత కలపాలి అనేది ఈ కింద పట్టికలో ఉన్నది.

| వయసు | చిరుధాన్యాలు (చిరుధాన్యాల పొట్టు, జొన్న, మొక్క జొన్న, బియ్యం పొట్టు) (గ్రా.లో) | ఆయిల్ కేక్ (పత్తి గింజలు, వేరుశెనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు) (గ్రా.లో) | చేప పొట్టు, గుడ్డు పెంకులు (గ్రా.లో) | పెండలం (గ్రా.లో) | మొత్తం (గ్రా.లో) |
|---|---|---|---|---|---|
| 0-8 వారాలు (కోడి పిల్లలకు) | 700 | 200 | 100 | - | 1000 |
| 9-27 వారాలు (ఎదిగే పిల్లలకు) | 650 | 150 | 50 | 150 | 1000 |
| ☒ 27 వారాలు (పెరిగిన కోళ్లకు) | 600 | 100 | 100 | 200 | 1000 |

## వ్యాధులు/రోగాల యాజమాన్యం

దేశీయ కోళ్ళకు మామూలుగా రోగాలు/వ్యాధులను తట్టుకునే శక్తి ఎక్కువగానే ఉంటుంది. అయినప్పటికీ, బ్రీడింగ్ ఫారంలో సరైన రీతిలో ఆరోగ్య సంరక్షణ ఏర్పాట్లు ఉండాలి. కోళ్ళు బయటి వాతావరణంలో తిరుగుతూ ఉంటాయి కాబట్టి బ్రీడింగ్ ఫారంలో సరైన జీవ సంరక్షణ చర్యలు తీసుకోవాలి. కోళ్ళ మందలో రోగాలు/వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే ఇది చాలా అవసరం. బ్రీడింగ్ ఫారంలో ఆహారం/దాణా, తాగు నీళ్ళు, ప్రమాదకరమైన పక్షులు, ఎలుకలు, పురుగులు, కుక్కలు, పిల్లులు, వాహనాలు, ఇతర ఉపకరణాల ద్వారా కోళ్ళకు రోగాలు/వ్యాధులు వ్యాపిస్తాయి. అందుకని, కోళ్ళ మందలో రోగాలు/వ్యాధుల వ్యాప్తిని నిరోధించడానికి తగిన జాగ్రత్తలు ముందుగానే తీసుకోవాలి.



ఆరోగ్యకరమైన కోళ్ళు, అనారోగ్యంతో ఉన్న కోళ్ళను ఎలా గుర్తించాలనేది పెంపకం దారులకు ముందుగానే తెలిసి ఉండాలి. సరైన ముందు జాగ్రత్తలు తీసుకోవడానికి లేదా చికిత్స చేయించడానికి ఇది అవసరం. ముందుగా చేయవలసింది ఏమిటంటే మందలో అనారోగ్యంగా ఉన్న కోళ్ళను మిగతావాటినుంచి వేరుచేసి, వాటికి చికిత్స అందించాలి. ఆరోగ్యకరమైన కోళ్ళు, అనారోగ్యంతో ఉన్న కోళ్ళను గుర్తించే క్రమంలో సాయపడే కొన్ని సూచనలు ఈ కింద పట్టికలో ఉన్నాయి:

## వ్యాధిగ్రస్థ కోడిని గుర్తించాల్సిన పద్ధతి

| ఆరోగ్యకరమైన కోళ్ళు | అనారోగ్యం/రోగం బారిన పడిన కోళ్ళు |
|---|---|
| చురుకుగా, సదా అప్రమత్తంగా ఉంటాయి. | అలసిపోయినట్టు, నిర్జీవంగా ఉంటాయి. |
| కళ్ళు, తలపైన జుత్తు మెరుస్తూ ఉంటాయి. | కళ్ళు, తలపైన జుత్తులో జీవం ఉండదు. |
| ఈకలు మృదువుగా, చక్కగా ఉంటాయి. | ఈకలు వదులుగా, పడిపోయినట్లుగా ఉంటాయి. |
| నిరంతరంగా నడవగలవు, పరుగెత్తగలవు, నిలబడగలవు, నేలను గీరుతూ ఉంటాయి. | ఊరికే కూర్చుంటాయి, పడుకుంటాయి. |
| మామూలుగా తింటాయి, నీళ్ళు తాగుతాయి. | తక్కువ తింటాయి. తక్కువ నీళ్ళు తాగుతాయి. |
| మామూలుగా గుడ్లు పెడతాయి. | గుడ్లు పెట్టడం మానేస్తాయి లేదా అసాధారణమైన గుడ్లు పెడతాయి. |
| మల విసర్జితాలు చిక్కగా, సాఫీగా ఉంటాయి. | మల విసర్జితాలు బాగా తడిగా, వదులుగా ఉంటాయి. రక్తం, పురుగులతో కూడిన విరేచనాలు కనపడతాయి. |
| శ్వాస మామూలుగా ఉంటుంది. | దగ్గు, జలుబు, చీదడం, గురకతో కూడిన శ్వాస, ముక్కు కారడం వంటి లక్షణాలు కనపడతాయి. |

సరైన జాగ్రతలు తీసుకుంటే, యాజమాన్య చర్యలు తీసుకుంటే, బ్రీడింగ్ ఫారంలో కోళ్ళకు వ్యాపించే రోగాలు/వ్యాధులను చాలామట్టుకు నిరోధించవచ్చు/నియంత్రించవచ్చు. అందుకని బ్రీడింగ్ ఫారంలో ఈ కింద తెలిపిన రీతిలో సరైన ఆరోగ్య సంరక్షణ యాజమాన్య పద్దతులు పాటించాలి:

- ఎల్లప్పుడూ పరిశుభ్రమైన గిన్నె/డ్రింకర్ ద్వారా కోళ్ళకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలి.
- బాగా ఆరిన, పరిశుభ్రమైన ప్రదేశంలోనే అదనపు దాణా పెట్టాలి.
- ఫీడర్‌ను ప్రతి రోజూ మంచి నీళ్ళతో కడగాలి. అది ఆరిన తరువాతనే వాడాలి.
- షెల్టర్ ను ప్రతి రోజూ శుభ్రం చేయాలి. ఆరబెట్టాలి.
- లోపల గోడలకు, ఫ్లోరింగ్ పైన తరచుగా సున్నం చల్లాలి.
- రోగాల బారిన పడి, వేరే కోళ్ళకు రోగం వ్యాపింపచేసే కోళ్ళను మంద నుంచి వేరు చేసి చంపివేయడం మంచిది.
- బ్రేదింగ్ ఫాంలో బాతులు, గినియా పక్షులు, టర్కీ కోళ్ళు వంటి వేరే జాతి జీవాలను పెట్టకూడదు.
- టీకాలు వేయించే 12-15 రోజుల తప్పనిసరిగా నట్టల మందు వేయాలి.
- నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి.

## కోళ్ళకు వచ్చే కొన్ని ప్రధాన వ్యాధుల నియంత్రణకు టీకాల షెడ్యూల్ పట్టిక:

| క్ర.సం | వయసు | వివరాలు |
|---|---|---|
| 01 | 7వ రోజు | కొక్కెర రోగ నియంత్రణకు 'లాసోటా' టీకా - I/O or I/N |
| 02 | 14వ రోజు | కొక్కెర రోగ నియంత్రణకు 'లాసోటా' టీకా - I/O or I/N |
| 03 | 8వ వారం | అమ్మతల్లి రోగ నియంత్రణకు 'అమ్మ తల్లి' టీకా -S/C or I/M |
| 04 | 9వ వారం | కొక్కెర రోగ నియంత్రణకు ఆర్.డి.వి.కే. టీకా -S/C or I/M |
| 05 | 18వ వారం | కొక్కెర రోగ నియంత్రణకు ఆర్.డి.వి.కే. టీకా -S/C or I/M |
| 06 | దేశీ కోళ్ళు (పెద్దవి) | లసోటా మందును నీళ్లలో కలిపి, ప్రతి 3 నెలలకు ఒకసారి దేశీ కోళ్లకు ఇవ్వాలి.<br>లసోటా టీకా వేసే ఒక వారం రోజుల ముందు నట్టల మందు (డీ వార్మింగ్) వేయాలి. |
| | | కె.వి.కే. నమ్మక్కాల్ సూచించిన టీకాల షెడ్యూల్ |

### సంబందిత అంశాలు - విశ్లేషణ : ఆరోగ్యకరమైన కోళ్ళ ఎంపికకు ప్రామాణిక అంశాలు

(ఏవైనా ఉంటే )

| నేర్చుకునే కాలవ్యవధి థియరీ/బోధన (3 గంటలు) | | ఆచరణాత్మక ప్రయోగాలు/ ప్రాక్టికల్స్ (2 గంటలు) |
|---|---|---|
| నేర్చుకున్న అంశాలు/ ఫలితాలు | విజ్ఞాన పరమైన అంశాలు/ఫలితాలు<br>1. బ్రీడింగ్ ఫాం లో అవసరమైన మౌలిక సదుపాయాలు ఏమిటనేవి తెలుసుకుంటారు<br>2. మంచి రకం పొదిగే కోళ్ళు, కోడి పుంజులను ఎంపిక చేయడం<br>3. కోళ్ళు మేత మేసే ప్రాంతం అభివృద్ధి, మంచి యాజమాన్య పద్ధతులు<br>4. దేశీ కోళ్ళ కోసం బ్రీడింగ్ ఫాం ఏర్పాటు చేసే పద్ధతి | నైపుణ్య సంబంధిత అంశాలు/ ఫలితాలు<br>1. మంచి రకం పొదిగే కోళ్ళు, కోడి పుంజులను ఎంపిక చేయడం<br>2. పొదగడానికి ఏర్పాట్లు<br>3. ఆహారం/దాణాకు సంబంధించిన పద్ధతులు |
| నేర్చుకోవడానికి రిఫరెన్స్ మెటీరియల్ | రీడింగ్ మెటీరియల్ (అభ్యాసకుల కిట్‌లో నుంచి) | |
| ఆలోచనా సరళికి అనుగుణంగా | విజ్ఞానం / నైపుణ్యం సంబంధిత ప్రశ్నలు: | |

### సెషన్ ఎక్సర్ సైజ్ / కేస్ స్టడీ

ఈ కింద తెలిపిన అంశాలపై గ్రూపు ఎక్సర్ సైజులు

1. రాత్రి వసతి (నైట్ షెల్టర్) నిర్మాణం, నిర్వహణ
2. మేత ప్రాంతపు అభివృద్ధి
3. పొదిగే సామర్థ్యం మెరుగుపర్చడం

### నేర్చుకునే కీలక అంశాలు - విశ్లేషణ

1. రాత్రి వసతి (నైట్ షెల్టర్) నిర్మాణం – లోపల విభజన అరలు
2. మేత ప్రాంతపు అభివృద్ధి
3. లాభాలు ఆర్జించే రీతిలో బ్రీడింగ్ ఫాం నిర్వహణ

****

# సెషన్ 5 - గ్రామ స్థాయిలో పెరటి కోళ్ళ పెంపకం- అభివృద్ధి కార్యక్రమానికి ప్రణాళిక

## సెషన్ మార్గదర్శిని:

| | | |
|---|---|---|
| **కోర్సు** | : | **గ్రామీణ ప్రాంతాల్లో పెరటికోళ్ల పెంపకం - పరిచయం** |
| సెషన్ నెం., పేరు | : | పెరటికోళ్ల పెంపకం కార్యక్రమాన్ని రూపొందించడం |
| సెషన్ ఉద్దేశాలు (అభ్యాసకుల మార్గదర్శిని) | : | గ్రామ స్థాయిలో పెరటి కోళ్ళ పెంపకం- అభివృద్ధి కార్యక్రమానికి ప్రణాళిక |
| సెషన్ లోని స్థూల అంశాలు (అభ్యాసకుల మార్గదర్శిని) | : | |

### 1. పెరటి కోళ్ళ పెంపకం కార్యక్రమానికి క్లస్టర్ ఏర్పాటు

ఆయా గ్రామాలలో ఫోకస్డ్ గ్రూప్ చర్చల ద్వారా జరిపిన పరిస్థితుల విశ్లేషణ ఆధారంగా, పెరటికోళ్ల పెంపకం కార్యక్రమం నిర్వహణకు యూనిట్ కేంద్రంగా ఒక క్లస్టర్‌ను గుర్తించాలి. కార్యక్రమ విస్తృతి పరిగణనలోకి తీసుకుని ఒక బ్లాకులో ఎన్ని క్లస్టర్లు ఉండాలనేది నిర్ణయించాలి. ప్రతి క్లస్టర్‌లోనూ 2–3 సమీప గ్రామాలకు చెందిన 100–120 కుటుంబాలను కార్యక్రమం కోసం ఎంపిక చేయాలి. టీకాలు, సంబంధిత ఆరోగ్య సేవలను అందించగలిగే సామర్ధ్యానికి అనుగుణంగా కుటుంబాల సంఖ్యను ఎంచుకోవాలి.

### 2. క్లస్టర్ స్థాయిలో పెరటి కోళ్ళ పెంపకం కోసం ఉమ్మడి ప్రయోజనాల బృందాల (సి.ఐ.జి.) ఏర్పాటు



కార్యక్రమం కోసం క్లస్టర్ స్థాయిలో ఉమ్మడి ప్రయోజనాల బృందం (సి.ఐ.జి) ఏర్పాటు చేయాలి. దానికోసం వీలయినంత వరకు గ్రామసభ తీర్మానం చేయాలి. కొత్తగా ఏర్పాటు చేయబోయే కోళ్ళ నిధికి తమ వాటాలు చెల్లించే విషయంలో సభ్యుల నుంచి ఒక తీర్మానం తీసుకోవాలి. కోళ్ళ నిధి కోసం దగ్గరలోని ఏదైనా ఒక బ్యాంకు లేదా పోస్టాఫీసులో ఒక పొదుపు ఖాతా ప్రారంభించాలి. ఈ నిధి నిర్వహణ, లావాదేవీలు నిర్వహించడానికి అధీకృత వ్యక్తులుగా ఉమ్మడి ప్రయోజనాల బృందం (సి.ఐ.జి.) సభ్యులు తమలో నుంచి ముగ్గురు వ్యక్తులను ఎంపిక చేసుకోవాలి. అతి కోళ్ళ పెంపకం కార్యక్రమ నిర్వహణ, సంబంధిత నిర్ణయాలు తీసుకోవడానికి సి.ఐ.జి. సభ్యులు ప్రతి నెలా సమావేశం కావాలి. పారదర్శకత, జవాబుదారీతనం కోసం కోళ్ళ నిధి ఖాతా వివరాలను ప్రతి నెలా జరిగే సి.ఐ.జి. సమావేశంలో పంచుకోవాలి.

టీకాలు వేసే వ్యక్తులకు సి.ఐ.జి. తనవద్ద నున్న కోళ్ళ నిధి నుంచి చెల్లింపులు జరపాలి. వాళ్ళ దగ్గర నుంచి టీకాల రికార్డులు తీసుకున్న తరువాత ఈ చెల్లింపులు జరపాలి.

### 3. కోళ్ళ పెంపకందార్ల సామర్ధ్య పెంపుదల



దేశీ కోళ్ళను పెంచేవాళ్లకు అవసరమైన సామర్ధ్య పెంపుదల కార్యక్రమాలు చేపట్టాలి. వీళ్ళ కోసం టీకాలు వేసే వ్యక్తులు (వ్యాక్సినేటర్లు) /ఇతర రిసోర్స్ పర్సన్లు అవసరమైన శిక్షణ అందించాలి. ముఖ్యంగా పెరటి కోళ్ళ పెంపకంలో ఉత్పతతి సామర్ధ్యం పెంచడానికి కావాల్సిన మెరుగైన యాజమాన్య పద్ధతులపై ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలి. కుటుంబ స్థాయిలో కోళ్ళ పెంపకపు రికార్డుల నిర్వహణ పరంగా కూడా వ్యాక్సినేటర్లు పెంపకందార్లకు కావాల్సిన మద్దతు ఇవ్వవచ్చు.

### 4. ఔత్సాహికులు/వ్యాక్సినేటర్ల కు శిక్షణ

ఔత్సాహికులు/వ్యాక్సినేటర్ల కోసం ప్రత్యేకమైన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలి. అలాంటి శిక్షణలకు అవసరమైన మాడ్యూల్స్ తయారు చేయాలి. ఈ శిక్షణా కార్యక్రమాల్లో స్థానికంగా ఉండే వెటర్నరీ సిబ్బంది పాలు పంచుకునేలా చూడాలి.

### 5. పర్యవేక్షణ - మదింపు

కార్యక్రమాన్ని పర్యవేక్షించే తీరుపైనే దాని విజయం ఆధారపడి ఉంటుంది. ఈ పర్యవేక్షణ విభిన్న స్థాయిల్లో జరగాలి. క్లస్టర్ స్థాయి, కుటుంబ స్థాయి, బ్రీడింగ్ ఫార్మ్ స్థాయిల్లో ఇది జరగాలి. పర్యవేక్షణ సమర్ధవంతంగా ఉండాలంటే, విభిన్న స్థాయిల్లో వివరాలు సేకరించవలసి ఉంటుంది. ఇప్పటి పరిస్థితుల్లో మొబైల్ ఆధారంగా ఆన్ లైన్, ఆఫ్ లైన్ తరహాలో వివరాలు సేకరించడానికి రకరకాల సాఫ్ట్‌వేర్లు అందుబాటులోకి వచ్చాయి. ఆయా స్థాయిల్లో ఆయా కార్యక్రమాలకు ఈ కింద తెలిపిన రీతిలో నిర్దిష్ట వ్యవధుల్లో వివరాలు సేకరించాలి.

| | | |
|---|---|---|
| ఎ) | కుటుంబ స్థాయి వివరాలు | - నెలవారీ |
| బి) | వ్యాపారాత్మక బ్రీడింగ్ ఫార్మ్ లో పాటించే యాజమాన్య పద్ధతులు | - ఒకసారి |
| సి) | బ్రీడింగ్ ఫార్మ్ లో ఉత్పత్తి వివరాలు | - నెలవారీ |
| డి) | కుటుంబ స్థాయిలో శిక్షణ వివరాలు | - శిక్షణ నిర్వహించిన సమయంలో |

**సంబంధిత అంశాలు - విశ్లేషణ : ఆరోగ్యకరమైన కోళ్ళ ఎంపికకు ప్రామాణిక అంశాలు**
**(ఏవైనా ఉంటే )**

| నేర్చుకునే కాల వ్యవధి | థియరీ/బోధన (3 గంటలు) | ఆచరణాత్మక ప్రయోగాలు/ ప్రాక్టికల్స్ (2 గంటలు) |
|---|---|---|
| నేర్చుకున్న అంశాలు/ ఫలితాలు | **విజ్ఞాన పరమైన అంశాలు/ఫలితాలు**<br>1. పెరటి కోళ్ళ అభివృద్ధికి ప్రణాళిక<br>2. కోళ్ళ పెంపకందార్లతో సి.ఐ.జి. ఏర్పాటు<br>3. చెల్లింపుల ప్రాతిపదికగా టీకా సేవల వ్యవస్థలు | **నైపుణ్య సంబంధిత అంశాలు/ ఫలితాలు**<br>1. వివరాల సేకరణ వ్యవస్థ<br>2. పెరటి కోళ్ళ పెంపకంలో స్థానిక పరిస్థితుల విశ్లేషణ<br>3. సి.ఐ.జి .ఏర్పాటు ప్రక్రియ<br>4. క్లస్టర్ స్థాయిలో కోళ్ళ పెంపకం కార్యక్రమ ప్రణాళిక<br>5. బడ్జెటింగ్ |
| నేర్చుకోవడానికి రిఫరెన్స్ మెటీరియల్ | రీడింగ్ మెటీరియల్ (అభ్యాసకుల కిట్‌లో నుంచి) | |
| ఆలోచనా సరళికి అనుగుణంగా విశ్లేషణ/మదింపునకు అనువైన ప్రశ్నలు | విజ్ఞానం / నైపుణ్యం సంబంధిత ప్రశ్నలు:<br>విశ్లేషణ/మదింపునకు అనువైన ప్రశ్నలు | |

## సెషన్ ఎక్సర్ సైజ్ / కేస్ స్టడీ

**ఈ కింద తెలిపిన అంశాలపై గ్రూపు ఎక్సర్ సైజులు**

1. క్లస్టర్ స్థాయిలో గ్రామాలలో దేశీ పెరటి కోళ్ళ పెంపకం – అభివృద్ధి కార్యక్రమం రూపొందించడం
2. గిరిజన మహిళలకు సుస్థిర ఆదాయం అందించే రీతిలో దేశీ కోళ్ళ పెంపకానికి గాను ఉమ్మడి ప్రయోజనాల బృందం (సి.ఐ.జి) ఏర్పాటు
3. దేశీ పెరటి కోళ్ళ పెంపకం – అభివృద్ధి కార్యక్రమంలో విభిన్న అంశాలు

## నేర్చుకునే కీలక అంశాలు - విశ్లేషణ

1. దేశీ పెరటి కోళ్ళ పెంపకం – అభివృద్ధి కార్యక్రమం రూపొందించి, అమలులో సమస్యలు
2. రాత్రి వసతి (నైట్ షెల్టర్), ఇతర ఆరోగ్య సేవల వ్యవస్థల ఏర్పాటు
3. గ్రామ స్థాయిలోనే మార్కెటింగ్ సౌకర్యాలు

****

**నోట్సు......**

APDMP

పల్లె జీవం

## 'పల్లె జీవం' - ఆంధ్రప్రదేశ్ కరవు సంసిద్ధతా పథకం ఉద్దేశం

కరువు పల్లెలు, రైతుల బతుకుల్లో జీవం నింపడానికి చేసే ఒక ప్రయత్నం ఇది...రైతులు తమ బతుకులు నిలుపుకునేలా.... పల్లె వనరులను కాపాడుకునేలా చేస్తుంది. కష్టమొచ్చినప్పుడే స్పందించడం కాకుండా, వర్షాధార వ్యవసాయంలోని ఇబ్బందులు, వాతావరణ మార్పులు, కరువు ప్రభావాలు, వాటివల్ల వచ్చే రకరకాల సంక్షోభ పరిస్థితులను తట్టుకుని,అందుబాటులో ఉన్న వనరులను కాపాడుకుంటూ, సమర్థవంతంగా వాటిని వాడుకునేలా రైతులను సంసిద్ధపర్చడం ఈ కార్యక్రమ లక్ష్యం.

రైతు సంఘాలబలోపేతం, భూగర్భ జలాలు పంచుకునే యాజమాన్య వ్యవస్థల ఏర్పాటు, నేలలో తేమను, జీవాన్ని పెంచడం, రైతుల అధ్వర్యంలో విత్తన వ్యవస్థల ఏర్పాటు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, పంటల వైవిధ్యత, కరువుకాలంలో రైతులకు ఆసరాగా ఉండే రీతిలో నీటి సంరక్షణ-వినియోగ పద్ధతులకు ప్రోత్సాహం, పశుజీవ వ్యవస్థలను పటిష్టపర్చడానికి సహాయక ఏర్పాట్లు వంటివి ఈ కార్యక్రమ వ్యూహాలు. ఇలాంటి పనులతో కరువు రిస్కు తగ్గించడం, రైతు కుటుంబాల జీవన భద్రత పెంచడానికి ప్రయత్నం జరుగుతుంది.

అంతర్జాతీయ ఆహార, వ్యవసాయ అభివృద్ధి సంస్థ (ఐఫాడ్) సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా ఈ పథకాన్ని చేపట్టింది. ఆంధ్రప్రదేశ్‌లోని 5 కరువు సంక్షోభ జిల్లాలు కర్నూల్, అనంతపూర్, కడప, చిత్తూరు, ప్రకాశం జిల్లాలలోఎంపిక చేసిన వర్షాధార ప్రాంతాలలో ఇది అమలవుతోంది. 'వాసన్' ప్రధాన సాంకేతిక సహాయ సంస్థగా దీనికి సేవలు అందిస్తోంది. విభిన్న ప్రభుత్వ విభాగాలు, పరిశోధనా సంస్థలు, క్షేత్రస్థాయిలో అనుభవమున్న స్వచ్ఛంద సంస్థలు, రైతు సంఘాలు సమన్వయంతో కలిసి పనిచేస్తున్న పథకం ఇది..

WASSAN